https://prajapratibha.com
RNI : APTEL 2013/54721

# ప్రజా ప్రతిభ

ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక

సంపుటి 13 | సంచిక 245 | prajapratibha.2013@gmail.com | ఎడిటర్ : దానూరి శ్రీనివాస్ | 9441500341 | వెల రూ. 5.00 | పేజీలు 13

ఆంధ్రప్రదేశ్ | Published from Andhra Pradesh & Telangana | బుధవారం, మే 13, 2026

## తమిళ సీఎం విజయ్ సంచలన నిర్ణయం

**బడులు, గుడులు, బస్టాండ్ల వద్ద వైన్ షాప్‌ల ఎత్తివేత**

**రెండువారాల్లోగా మూసేయాలంటూ ఆదేశాలు**

**విజయ్ సోషల్ మీడియాకు పెరుగుతున్న ఆదరణ**



**చెన్నై, మే12 (ప్రజా ప్రతిభ):** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు మిగతా 2లో..

## కొత్తగా 5 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు

**దశలవారిగా 1275 ఖాళీల భర్తీ**

**పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రీల భాగస్వామ్యం**

**అధికారులతో సమీక్షలో హోంమంత్రి అనిత**



**అమరావతి, మే12 (ప్రజా ప్రతిభ):** కొత్తగా ప్రతిపాదించిన 5 ఫైర్‌స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు. విశాఖపట్నం పశ్చిమ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రీల భాగస్వామ్యంతో ఫైర్‌స్టేషన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. అగ్నిమాపక శాఖలో మిగతా 2లో..



## 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'ను కలవడం సంతోషంగా ఉంది



**గౌహతిలో కేంద్ర మంత్రి గడ్కరీతో చంద్రబాబు, లోకేష్ భేటీ**

**అసోం సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన నేతలు**

**గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించిన లోకేష్**

**ఏపీలో జరుగుతున్న పనులను గడ్కరీ ప్రశంసించారని వెల్లడి**

**గౌహతి, మే12 (ప్రజా ప్రతిభ):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గౌహతిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసోం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన వీరు, గౌహతి విమానాశ్రయంలో గడ్కరీని కలిశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా' అని అభివర్ణించిన లోకేష్, ఆయనను కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జాతి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలో గడ్కరీ చూపిస్తున్న ఉత్సాహం తమందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశాన్ని వేగంగా, బలంగా నిర్మించాలన్న ఆయన తపన అమోఘమని మిగతా 2లో..

## అన్నా డీఎంకేలో లుకలుకలు

**పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు**

**టీవీకేకు మద్దతు ప్రకటించిన షణ్ముగం వర్గం**



**చెన్నై, మే12 (ప్రజా ప్రతిభ):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకే లో లుకలుకలు బయటపడ్డాయి. పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు మొదలయ్యింది. తాజాగా ఆ పార్టీలోని సీవీ షణ్ముగం వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ మిగతా 2లో..



## తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్

**డిప్యూటీ స్పీకర్‌గా రవిశంకర్ ఎన్నిక**

**చెన్నై, మే12 (ప్రజా ప్రతిభ):** తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్ మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీవీకేకు చెందిన మరో ఎమ్మెల్యే రవిశంకర్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు ప్రోటెం స్పీకర్ ఎంవీ కరప్పయ్య మిగతా 2లో..

## అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ

**ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు**

**ఎన్‌డీ ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక**



**గౌహతి, మే12 (ప్రజా ప్రతిభ):** అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణ స్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన మిగతా 2లో..

## లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

**నీట్ పరీక్ష రద్దుపై మండిపడ్డ రాహుల్**



**న్యూఢిల్లీ, మే12 (ప్రజా ప్రతిభ):** నీట్ ప్రశ్నాపత్రం లీక్ కారణంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది కష్టాన్ని, కలల్ని బీజేపీ ప్రభుత్వం ఛిద్రం చేసిందని విమర్శించారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, యువత భవిష్యత్తును కాలరాసే నేరమని మిగతా 2లో..

## ప్రతిభ చాటుతున్న బీసీ సంక్షేమ స్కూళ్ల విద్యార్థులు



**టెన్త్‌లో ర్యాంకులు సాధించిన వారికి మంత్రి అభినందనలు**

**400 మంది విద్యార్థులకు పురస్కారాలు, మెమొంటోలు**

**విజయవాడ, మే12 (ప్రజా ప్రతిభ):** టెన్త్ క్లాస్‌లో మంచి మార్కులు సాధించిన గురుకుల విద్యార్థులను మంత్రి సవిత సత్కరించారు. దాదాపు 400 మంది విద్యార్థులకు పురస్కారాలు, మెమోంటోలను అందజేశారు. టెన్త్ క్లాస్‌లో ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థిని, నంద్యాలకు చెందిన సాయి శ్రీ 596 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా మిగతా 2లో..

## జగన్‌వి నీతి మాలిన రాజకీయాలు



**అభివృద్ధి అంటే గిట్టని వైసీపీ నేత**

**అమరావతిని చూసి ఓర్వలేక మావిగన్ జపం**

**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం, మే12 (ప్రజా ప్రతిభ):** మూడు రాజధానుల వ్యవహారం ముగిసినా..ఇప్పుడు మావిగన్ పేరుతో జగన్ విన్యాసాలు చేస్తున్నారని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక జగన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించి మిగతా 2లో..

## పవన్ ప్రతిష్ఠ దెబ్బతీయాలన్న కుట్ర

**నాగార్జున యాదవ్ వ్యాఖ్యలపై సత్తెనపల్లిలో కేసు నమోదు**

**కేంద్ర నిధుల దారి మళ్లింపుపై ఆరోపణలు, రాజకీయ దుమారం**

**తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ జనసేన ఆగ్రహం**



**సత్తెనపల్లి, మే12 (ప్రజా ప్రతిభ):** గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దారి మళ్లించారంటూ వైసీపీ మాజీ ఎమ్మెల్సీ నాగార్జున యాదవ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన జనసేన నాయకులు, అవి పూర్తిగా నిరాధార ఆరోపణలేనని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో మిగతా 2లో..




## నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

**పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టీఏ నిర్ణయం**

**సీబీఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి**

**13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**న్యూఢిల్లీ, మే12 (ప్రజా ప్రతిభ):** జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని మిగతా 2లో..

## 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్

**రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**అమరావతి, మే12 (ప్రజా ప్రతిభ):** ఏపీలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై 24 గంటల్లోనే కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. వాహనదారులకు వేగవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. డీలర్ టెంపరరీ రిజిస్ట్రేషన్ అనంతరం 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్‌కు ఆమోదం ఇవ్వాలని అధికారులను మిగతా 2లో..



# జగన్‌వి నీతి మాలిన రాజకీయాలు



(మొదటి పేజీ తరువాయి)

పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి లాంటి దుర్మార్గుడి చూపు రాష్ట్రంపై పడకూడదని నాడు ఆయన తండ్రే తరిమేశారని ఆరోపించారు. ప్రజావేదిక కూల్చివేతతో జగన్ రెడ్డి రాష్ట్రంపై తన దుర్మార్గాలకు శ్రీకారం చుట్టారని దుయ్యబట్టారు. మూడు రాజధానుల పేరుతో అధికారంలో ఉన్న ఐదేళ్లు అరాచకం సృష్టించారని మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహించారు. భూములిచ్చిన రైతన్నలను పోలీసుల లాఠీలతో కొట్టించి, బూటు కాళ్లతో తన్నించారని విమర్శించారు. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కేసినోళ్లు కూడా నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ తన తండ్రి

అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రో కో ద్వారా ప్రజల ఆస్తులను దోచారని మండిపడ్డారు. ఐదేళ్లు అడ్డగోలుగా దోచుకుని అమరావతి నిర్మాణంపై నిందలేయడం సిగ్గుచేటని అన్నారు. మావిగన్ అంటూ ఇప్పుడు మాట్లాడే వైసీపీ నేతలు.. గత ఐదేళ్లు ఏం చేశారు..? అని ప్రశ్నించారు. జగన్ రెడ్డికి భజన చేయడం తప్ప వైసీపీ నేతలు సొంత బుర్రలు వాడటం మానేశారని సెటైర్లు గుప్పించారు.

అమరావతే రాజధాని అని ఒకసారి.. మూడు రాజధానులని మరోసారి.. ఇప్పుడు మావిగన్ అంటూ నీతి లేని వ్యాఖ్యలు చేస్తున్నారని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కృష్ణా గుంటూరు జిల్లాల్లోని వైసీపీ నేతలు జగన్ రెడ్డికి భజన చేయడం తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టదా..? అని నిలదీశారు. మూడు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాయలసీమకు గతంలో కియా, ఇప్పుడు డ్రోన్స్, డిఫెన్స్, రాయల్ ఎన్ ఫీల్డ్ తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఉత్తరాంధ్రలో భోగాపురం, గూగుల్ డేటా సెంటర్, అర్సెలార్ మిట్టల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు నీతులు మాట్లాడుతున్న బియ్యం దొంగ ఐదేళ్లలో బందరు పోర్టు ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేర్ని నాని తన స్థాయి మరిచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురించి మాట్లాడుతున్నారని కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. ఫ్యాన్సీ నంబర్ వాహనాలకు మాత్రమే మినహాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. గడువులోపు సంబంధిత అధికారులు స్పందించకపోతే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ ఆమోదం అయినట్లు పరిగణించనున్నట్లు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్‌ను ఆమోదిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, సులభంగా సేవలు అందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ కొత్త విధానం అమలు చేయనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు.

## పవన్ ప్రతిష్ఠ దెబ్బతీయాలన్న కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

జనసేన నాయకుడు రామ సైదులు పల్నాడు జిల్లా సత్తెనపల్లి గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో ప్రభుత్వంపై అపోహలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు నాగార్జున యాదవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు, వ్యాఖ్యల వెనుక ఉద్దేశాలను పరిశీలిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

ఇదిలా ఉండగా, పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని జనసేన శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమయంలో అసత్య ప్రచారంతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం దురదృష్టకరమని విమర్శించాయి.

అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యమంటూ జనసైనికుల విమర్శలు

## 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'ను కలవడం సంతోషంగా ఉంది

(మొదటి పేజీ తరువాయి)

కొనియాడారు. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గడ్కరీ ప్రశంసించారని లోకేష్ వెల్లడించారు. ఏపీలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు నిర్మించేందుకు తాము చేస్తున్న కృషికి ఆయన ప్రోత్సాహం ఎంతో విలువైనదని లోకేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ భేటీలో చంద్రబాబు, గడ్కరీ పలు అంశాలపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

## కొత్తగా 5 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

1,275 ఖాళీలను దశల వారీగా భర్తీ చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ పనితీరుపై అనిత సచివాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫైర్‌స్టేషన్లు లేని 22 నియోజకవర్గాల పరిస్థితిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడారు. జాబ్ క్యాలెండర్‌లో ఉన్న 305 పోస్టుల నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫైర్ సిబ్బంది స్పందన సమయాన్ని 30 నిమిషాల నుంచి 15 నిమిషాలకు తగ్గించాలని మార్గనిర్దేశం చేశారు. పరిశ్రమల సహకారంతో ఫైర్ అవుట్‌పోస్టుల ఏర్పాటును పరిశీలించాలని హోంమంత్రి అనిత సూచించారు. ఫైర్ టెండర్ల వినియోగంపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. సెజ్ ప్రాంతాల్లో సమష్టి స్టేషన్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని పేర్కొన్నారు. పరిశ్రమల్లో ఫైర్‌సేఫ్టీ అధికారుల నియామకం తప్పనిసరిగా చేయాలని స్పష్టం చేశారు. లైసెన్స్ పొడిగింపులకు ÷ర్‌సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయాలని సూచించారు. అడవిలో అగ్నిప్రమాదాల నియంత్రణలో డ్రోన్ల వినియోగంపై దృష్టిసారించాలని ఆదేశించారు. వ్యర్థాలపై సరైన వర్గీకరణ లేకపోవడంతో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లల్లో ÷ర్‌సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. 'ఆపద మిత్ర' తరహాలో యువతకు స్వచ్ఛంద సేవా శిక్షణను విస్తరించాలని సూచించారు. సింగపూర్, స్విట్జర్లాండ్ విపత్తు నిర్వహణ విధానాలపై అధ్యయనం చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఛత్తీస్‌గఢ్, చండీగఢ్ నమూనాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అగ్నిమాపక అత్యవసర సేవలను 112 సేవలతో సమన్వయం చేయాలని హోంమంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు.

## లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

(మొదటి పేజీ తరువాయి)



ఆరోపించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగాలు, ఎన్నో కుటుంబాల ఆశలు ఈ అవినీతి పాలన వల్ల నాశనమయ్యాయని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది తండ్రులు అప్పులు చేశారని, తల్లులు తమ నగలు అమ్మారని, లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివారని, అయితే పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో అవినీతి వారికి శాపంలా మారాయని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించుకుంటోందని, నిజాయతీగా చదివిన విద్యార్థులే శిక్ష అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టం కాదు.. డబ్బు, పరిచయాలే భవిష్యత్తును నిర్ణయిస్తే విద్యకు అర్థమేంటి? ప్రధాని చెప్పే అమృత కాలం దేశ యువతకు విష కాలంగా మారింది' అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రతిభ చాటుతున్న బీసీ సంక్షేమ స్కూళ్ల విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)




మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం అంతా బీసీ సంక్షేమ స్కూల్స్‌వైపే చూడ్డానికి కారణం ప్రిన్సిపాల్స్, సెక్రటరీస్, డైరెక్టర్లు అని అన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులు నిరూపించారన్నారు. వేదిక మీద చాలామంది గవర్నమెంట్ స్కూళ్లలో చదువుకున్నవారే ఉన్నారన్నారు. 'తల్లిదండ్రులు మమ్మల్ని నమ్మి.. మీ బిడ్డలను బీసీ సంక్షేమ స్కూల్స్‌కు పంపించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు' అని మంత్రి అన్నారు. తల్లిదండ్రులు కోరుకున్న విధంగానే విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయని తెలిపారు. రోజుకి 20 గంటలు పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ సంక్షేమ స్కూల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. అధికారంలోకి రాగానే డైట్ బిల్లు రూ.110 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మస్కిటో మెష్, ఇన్వెటర్స్, ఆర్వో ప్లాంట్స్, సన్న బియ్యం, 100 డేస్ యాక్షన్ ప్లాన్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంట్లో ఎంతమంది బిడ్డలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' అందిస్తున్నామన్నారు. విద్యతో పాటు స్పోర్ట్స్ డెవలప్ చేసే దిశగా కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. 1500 టాయిలెట్స్ బీసీ స్కూళ్లలో రెడీ అవుతున్నాయని అన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం మంచి రాజధాని నిర్మిస్తున్నామని తెలిపారు. ఎంజేపీ గురుకులాల్లో ప్రస్తుతం స్కూల్స్ మాత్రమే ఉన్నాయని.. 6 కాలేజీల ఏర్పాటుకు అనుమతి వచ్చిందని మంత్రి అన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఇంటర్నేషనల్ అవార్డ్స్ కూడా వచ్చాయన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో ఒక హాస్టల్ విద్యార్థికి 75 వేల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు.

## అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ

(మొదటి పేజీ తరువాయి)



కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు.

హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

## తమిళ సీఎం విజయ్ సంచలన నిర్ణయం



(మొదటి పేజీ తరువాయి)

బస్‌స్టాండ్స్‌కి 500 మీటర్ల దూరంలో ఉన్న 717 వైన్ షాపులన్నింటినీ క్లోజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దుకాణాలను రెండు వారాల్లోగా మూసివేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత విజయ్ జారీ చేసిన తొలి ఉత్తర్వు ఇది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ 4,765 మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. వీటిలో 276 మద్యం దుకాణాలు ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యా సంస్థల సమీపంలో, 255 బస్ స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. వీటిని వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. కాగా మద్యం అమ్మకాల ద్వారానే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. 2025 సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్రానికి రూ.48,000 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే తమిళనాట దళపతి విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల్లో ఆయనను అభిమానించే వారు ఉన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాల్లో విజయం సాధించింది. రెండు రోజుల క్రితం విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తమిళనాడు సీఎంఓ ఆఫీస్ సోషల్ మీడియా ఖాతాల డీపీలు మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ఫొటోలను డీపీలుగా పెట్టారు. విజయ్ ఫొటో డీపీగా పెట్టిన గంటల్లోనే మ్యాజిక్ జరిగింది. సోషల్ మీడియా ఖాతాలకు ఫాలోవర్స్ క్యూ కట్టారు. తమిళనాడు సీఎంఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మొదట 4 లక్షల ఫాలోవర్స్ ఉండేవారు. విజయ్ ఫొటో పెట్టిన తర్వాత 16 లక్షలకు ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. ఇక ఎక్స్ ఖాతాకు కూడా 4 లక్షల మంది ఫాలోవర్స్ ఉండేవారు. ఇప్పుడు 22 లక్షల మంది అయ్యారు. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలకు ప్రజలు జై కొడుతున్నారు.

## అన్నా డీఎంకేలో లుకలుకలు

(మొదటి పేజీ తరువాయి)

సారథ్యంలోని తమిళగ వెట్రి కళగంకు మద్దతు ప్రకటించింది. ఆయన వర్గంలో 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. డీఎంకేతో చేతులు కలపాలని అన్నాడీఎంకే అనుకుందని, అందుకే పళనిస్వామి వర్గం నుంచి తాము విడిపోయామని మంగళవారంనాడు మీడియాతో మాట్లాడుతూ షణ్ముగం తెలిపారు. ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చినట్టు చెప్పారు. వరుస ఓటములకు పళనిస్వామే కారణమని విమర్శించారు. పార్టీ పదవి నుంచి ఆయన దిగిపోవాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే గత దశాబ్ద కాలంగా పలు ఓటములను చవిచూసిందని, మూడుసార్లు చిరకాల ప్రత్యర్థి డీఎంకే చేతిలో ఓడిపోతే, గత నెలలో టీవీకే చేతిలో మరో ఓటమి చవిచూసిందని షణ్ముగం తెలిపారు. పార్టీని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అన్నాడీఎంకే భవిష్యత్తుపై కూలంకషంగా చర్చించాలని అన్నారు. ఎన్నికల్లో విజేతగా నిలిచిన టీవీకేకు మద్దతివ్వాలని మేము నిర్ణయించాం. డీఎంకేకు వ్యతిరేకంగానే అన్నాడీఎంకే పార్టీని స్థాపించడం జరిగింది. 53 ఏళ్లుగా డీఎంకేకు వ్యతిరేకంగానే పార్టీ రాజకీయాలు నడిచాయి. చరిత్ర ఇలా ఉంటే డీఎంకే మద్దతుతో అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు కావాలనే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అయితే మెజారిటీ సభ్యులు ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారు. డీఎంకేతో పొత్తు పెట్టుకోవడం అంటే అన్నాడీఎంకే సొంత ఉనికి కోల్పోవడమే అవుతుంది. ప్రస్తుతం మా దృష్టి ఉంతా పొత్తులపై లేదు. సొంత పార్టీని పునరుద్ధరించి, పటిష్టం చేయడమే మా ఉద్దేశం. అంతిమంగా ఎన్నికల్లో విజయం సాధించిన టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించాం' అని షణ్ముగం తెలిపారు. సొంత పార్టీని చీల్చే ఉద్దేశం లేదని షణ్ముగం వివరణ ఇచ్చారు. పార్టీ కీలక నాయకత్వంపై పోరాటంగా దీనిని పేర్కొన్నారు. ముఖ్యంగా విజయ్, టీవీకేతో పొత్తుకు గత వారంలో నిరాకరించిన మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి వ్యతిరేకంగా తామంతా తీసుకున్న నిర్ణయమని చెప్పారు.

## తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్



(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. తొలుత ప్రభాకర్ నామినేషన్‌ను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ప్రతిపాదించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది. అనంతరం ప్రోటెం స్పీకర్‌గా తన పాత్ర ముగిసినట్టు కరుప్పయ్య ప్రకటించారు. ఆ వెంటనే సభాసాంప్రదాయం ప్రకారం స్పీకర్ ప్రభాకర్‌ను ఆయన చైర్ వరకూ సభానేత కేఏ సెంగోట్టియన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తోడ్కొని వెళ్లారు. ఆయనకు అభినందనలు తెలిపారు. స్పీకర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నికను చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ పదవికి తురైయూర్ టీవీకే ఎమ్మెల్యే ఎం.రవిశంకర్ ఒక్కరే నామినేషన్ వేశారని, దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైందని ప్రభాకర్ ప్రకటించారు. రవిశంకర్ నామినేషన్‌ను సెంగోట్టియన్ ప్రతిపాదించారు.

## నీట్ ప్రవేశ పరీక్ష రద్దు



(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

https://prajaprathibha.com RNI: APTEL 2003/54721
ప్రజా ప్రతిభ
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts
Praja Pratibha News
బుధవారం
13 మే 2026

# ఉపాధి' కూలీల ఆకలి కేకలు..!

- ఫేస్ యాప్‌తో కూలీలకు అవస్థలు
- రెండుసార్లు ఫోటోకు తప్పని తిప్పలు
- " వేధిస్తున్న సిగ్నల్ సమస్య
- వసతులు లేక మండుటెండల్లో విలవిల
- కనిపించని టెంట్లు ,మెడికల్ కిట్‌లు, మజ్జిగ, మంచినీరు
- ఎండకు ఎండుతున్న కూలీలు
- నెల రోజులుగా మండుతున్న ఎండలు






**నంద్యాల బ్యూరో మే 11, ప్రజా ప్రతిభ :**

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో నూతన విధానంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ద్వారా ముఖ గుర్తింపు హాజరు విధానం అమలు చేయడంతో రెండు సార్లు ఫోటో దిగవలసి ఉంటుంది. కానీ సిగ్నల్ సమస్యలు తదితర సమస్యల వలన ఎండల్లో అలసి పోతున్న కూలీలు గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కూలీలకు కొంత ఆదరణగా నిలుస్తున్నప్పటికీ, ఇటీవల కొత్తగా అమలు చేస్తున్న బయోమెట్రిక్ హాజరు విధానం మాత్రం వారికి తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. నంద్యాల జిల్లా పాములపాడు మండలం కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉపాధి హామీ పనులకు సెల్ ఫోన్ సెగ తగులుతోంది. తాజాగా తీసుకొచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) ఫేస్‌యాప్ తో కూలీలకు అవస్థలు తప్పడం లేదు. గంటల తరబడి ఎండలో గంటల తరబడి ఉన్నా ఫేస్ యాప్‌లో ఫొటో పడకపోవడంతో హాజరు లేక కూలీలకు వేతనం అందడం లేదు. దీంతో కూలీలంతా లబోదిబోమంటున్నారు. మరోవైపు ప్రభుత్వం పెట్టిన నిబంధన మేరకు ఉదయం 6గంటలకే ఉపాధి పనికి హాజరు కావాల్సి ఉంది. దీంతో ఉరుకులు పరుగులుతో హాజరైన కూలీలకు ఫేస్ యాప్ పనిచేయక ..ఉపాధి పనులకు అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. ఉపాధి హామీలో గతనెల మార్చి 7 తేదీ నుంచి మొబైల్ మానటరింగ్ సిస్టమ్ తీసుకురావడంతో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. ఏప్రిల్ 1 నుంచి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ-2025 (విబిజి రామ్‌జి ) అమలు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అయితే దీనికి ఇంకా విధి విధానాలు ఖరారు కాకపోవడంతో మే 1 నుంచి అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా మరిన్ని పని దినాలు కల్పించాల్సి ఉన్నా సాంకేతిక సమస్యలతో ముందుకు సాగడం లేదు.

**మొబైల్ యాప్ తో అవస్థలు :**

మొబైల్ మోనటరింగ్ యాప్‌తో ఫేస్ ను బయోమెట్రిక్ చేయాలి. కానీ గంటల తరబడి ఫేస్ పడకపోవడంతో అనేకమంది ఉపాధికి దూరమవుతున్నారు. పలువురు కూలీలకు ఆధార్ బయోమెట్రిక్ పూర్తి కాకపోవడంతో ఫేస్ ఆదరైజేషన్ ( ముఖ ధ్రువీకరణ) లేకపోవడంతో తరచూ కే-100 ఎర్రర్ చూపిస్తోంది. ఆధార్ బేస్డ్ ఈకేవైసీ మాస్టర్ నమోదు వలన అనేకమందికి ఈకెవైసి పూర్తి కాలేదు. కొంతమందికి పూర్తయినప్పటికీ ఎన్ఎంఎంఎస్ సర్వర్లో లోపాల వలన వారి వివరాలను యాప్ లో చూపించడం లేదు. దీంతో పని ప్రదేశం నుంచి అనేకమంది కూలీలు ఇళ్లకు వెను తిరగాల్సి వస్తుంది. పని ప్రదేశంలో భువన్ యాప్ ద్వారా జియో టాగింగ్ చేస్తున్నారు. అయితే అక్కడ నుంచి మాత్రమే ఫేసు యాప్ ద్వారా హాజరు నమోదు చేయాల్సి వస్తుంది. అక్కడ నుంచి కొంత దూరం వెళ్లిన తర్వాత హాజరు నమోదు కావడం లేదు. ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసే క్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఏ చెరువును ఎక్కడ నుంచి టాగ్ చేశారో అక్కడ మాత్రమే ఎఫ్ఆర్ఎస్ అవుతుంది తప్ప పని జరుగుతున్న చెరువు ప్రాంగణంలో హాజరు నమోదు కావడం లేదు. దీంతో అనేకమంది కూలీలు పని చేసిన చోటే గంటలు తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మండుటెండల్లో మధ్యాహ్నం వరకు కూడా ఈ నమోదు కోసం నిరీక్షణ చేస్తున్నారు. మరికొందరు కూలీలు ముఖ ధ్రువీకరణకు పలుచోట్ల ముఖాలకు ఫేస్ పౌడర్ రాసుకొని పను

**సర్వర్ సమస్య ఎక్కువ :**

యాప్ లో పదేపదే వర్కర్ ఫోటో మళ్లీ మళ్లీ తీయాలని చూపిస్తుంది. సర్వర్ సక్రమంగా పనిచేస్తే ఒక్కొక్కరి హాజరు నమోదుకు 2నుంచి 3 నిమిషాలు పడుతుంది. పలుమార్లు సర్వర్ మొరాయిస్తున్న నేపథ్యంలో 5 నుంచి 6 నిమిషాలు సమయం పడుతుంది. దీంతో పని ప్రదేశంలో సుమారు 200 నుంచి 300 మందికి ఫేస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలంటే గంటల తరబడి సమయం వెచ్చించాల్సి వస్తుంది అంటూ ఉపాధి హామీ పథకం సిబ్బంది చెబుతున్నారు. పని ప్రదేశానికి వచ్చిన వెంటనే వ్యక్తిగతంగా పేస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేస్తుండగా పని నుంచి తిరిగి వెళ్లేటప్పుడు గ్రూప్ ఫోటో తీయాల్సి వస్తుంది. మండుతున్న ఎండల వేళ రెండు మూడు కిలోమీటర్లు పని ప్రదేశానికి నడిచి వెళ్లి తీరా హాజరు నమోదు కాని పరిస్థితుల్లో అసహనానికి గురై అనేకమంది వెనక్కి తిరిగి వస్తున్నారు. ఉపాధి పనులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న వేలాదిమందికి కొత్త విధానం ద్వారా పనులు లభించని దుస్థితి ఏర్పడింది. వసతులూ కరువే మండుటెండలో పనిచేసే ఉపాధి కూలీలకు సేద తీరడానికి గతంలో టార్పాలిన్లు అందజేసేవారు.

**మండుటెండలో ఉపాధి హామీ పనులు :**

మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసే కూలీలు మండుటెండలో పనులు చేస్తూ మగ్గిపోతున్నారు. కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరిగి 43 డిగ్రీలకు చేరింది. దీంతో ఉపాధి కూలీలు ఎండలకు అల్లాడిపోతున్నారు. దీనికి తోడు పని ప్రదేశాలలో మంచినీరు, మజ్జిగ, ఫస్ట్ ఎయిడ్స్ కిట్‌లు అందుబాటులో లేకపోవటంతో పలు చోట్ల కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు.

**కనిపించని టెంట్లు :**

మండలం మొత్తం మీద 16225 జాబ్ కార్డులకు గానూ 25 వేల మంది కూలీలు ఉండగా ప్రస్తుతం 8665 మంది ఉపాది కూలీలు నిత్యం పనుల్లో నిమగ్నమవుతున్నారు. అయితే పని ప్రదేశంలో నీడను ఏర్పాటు చేసుకోవటానికి టెంట్లు, పట్టలు అందించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. గతంలో ప్రభుత్వం టెంట్‌లు ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్తగా టెంట్‌లుమంజూరుచేస్తే ఉపాధి కూలీలకు ఉపయుక్తంగా ఉంటుంది.

**మెడికల్ కిట్‌లు లేవు :**

ఉపాధి కూలీలకు అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు అధికారులు మెడికల్ కిట్‌లను అందించాల్సి ఉండగా అధికారులు గత ఏడాది నుండి ఆదిశగా అటువంటి చర్యలేమి చేపట్టలేదు. ప్రస్తుతం ఎండతీవ్రత పెరగడంతో అనేక మంది తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయిన ఘటనలు అనేకం. పని ప్రాంతాలలో ఎక్కువగా తేళ్లు, పాముకాట్లకు గురయ్యేవారు అనేకం ఉన్నారు. దీంతో ప్రథమ చికిత్స కిట్‌లు లేక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కనిపించని మజ్జిగ, మంచినీరు :**

కూలీలకు ప్రభుత్వం మజ్జిగ, మంచినీరు పంపిణీ సరఫరా చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు ఎక్కడా చేపట్టటం లేదు. కూలీలంతా పని ప్రదేశానికి సీసాల ద్వారా నీళ్లు తీసుకెళ్తున్నారు. అవి కొద్దిసేపటికే అయిపోవటంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని కూలీలు చెబుతున్నారు. సగటు వేతనం 300 రూపాయలు పని చేస్తే మజ్జిగ పంపిణీ డబ్బులు వస్తాయని లేదంటే రావని అధికారులు అంటున్నారు.

## ఆంజనేయ స్వామి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు..

- ప్రతి రోజు హనుమాన్ చాలీసా పఠించడం వల్ల ఆధ్యాత్మికం, మానసిక, శారీరక ప్రయోజనాలు
- బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్
- ఎర్రగూడూరు లో హనుమాన్ హోమం, ఉత్సవం నిర్వహణ





**నంద్యాల బ్యూరో మే 12**

నంద్యాల జిల్లా పాములపాడు మండలం ప్రతి రోజు హనుమాన్ చాలీసా పఠించడం వల్ల ఆధ్యాత్మికంగానే కాకుండా మానసిక మరియు శారీరక ప్రయోజనాలు అనేకం కలుగుతాయని భక్తుల నమ్మకమని బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ అన్నారు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం, ఎర్రగూడూరు గ్రామంలో ఆంజనేయ స్వామి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు, హోమం, ఉత్సవం నిర్వహించారు. రుద్రవరం గ్రామంలో భక్తులు. భక్తిశ్రద్ధలతో శ్రీరాముని, హనుమంతుని జపిస్తూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాములపాడు మండల బిజెపి అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఆంజనేయస్వామిని జపించడం వల్ల ధైర్యం, శక్తి, భక్తి పెరుగుతుందని, హనుమాన్ చాలీసాను చదవడం, శ్రీరామ జపాన్ని పాటించడం వల్ల విశేషమైన ఫలితాలు పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం బిజెపి ప్రవీణ్ కుమార్, కృష్ణా గౌడ్, హనుమాన్ భక్త బృందం అధ్యక్షులు లింగస్వామి, వడ్ల శంకర్ ఆచారి, జాల కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం జిల్లా అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి చర్చలు



**రాజవొమ్మంగి మే 12 ప్రజాప్రతిభ న్యూస్**

రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి మంగళవారం పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.విద్యార్థులకు కుల ధృవీకరణ పత్రాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.అడ్డతీగల మండలం డొక్కపాలెం నుంచి కోవెలపాలెం వరకు, దుచ్చర్తి కొత్తూరు నుంచి బందమామిళ్లు వరకు, అనంతగిరి నుంచి రాజవొమ్మంగి వరకు బీటీ రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు అందించారు.అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారి పనులను పూర్తి చేసేలా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.

## ఘనంగా హనుమాన్ జయంతి : భక్తులకు అన్నదానం



**మార్కాపురం జిల్లా ప్రతినిధి / కొండ్రు వెంకటేశ్వర్లు మే 12( ప్రజా ప్రతిభ)**

మండల పరిధిలోని నాగంపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. హనుమాన్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాలనీ వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు మరియు మహిళలు స్వచ్ఛందంగా పాల్గొని సేవలందించారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఈ వేడుకను జరుపుకోవడం విశేషం.

## మహిళా సంఘాల బలోపేతంతో గ్రామీణాభివృద్ధి సాధ్యం

### - ఎంపీటీసీ

**రంపచోడవరం డివిజన్ ప్రజా ప్రతిభ మే 12**

పోలవరం జిల్లా, బొడ్డగండి పంచాయతీ పరిధిలోని డొంకరాయిల గ్రామంలో రెండు వి ఓ పరిధిలో మహిళా సంఘాల సభ్యులకు,స్త్రీ నిధి పరిధిలో వివిధ రకాలైన రుణాలు జీవనోపాధి,వాటి వినియోగ పై, మరియు ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలు అవుతున్న వివిధ ఆర్థిక అభివృద్ధి పథకాలపై వెలుగు సి సి రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీటీసీ శ్రీ కరకా వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై మహిళా సంఘాల సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాలు, ఎంతో కీలకమని అన్నారు.చంద్రబాబు ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న జీవనోపాధి రుణాలు, బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్ వంటి పథకాలను సద్వినియోగం చేసుకుంటే కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుందని,మన బొడ్డగండి గ్రామపంచాయతీకి ఒక్క స్త్రీ నిధి ద్వారా ప్రభుత్వం దాదాపు మూడు కోట్ల మంజూరు చేసిందని ఈ డబ్బు రుణాలు ద్వారా తీసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు ముఖ్యంగా వ్యవసాయం, పశుపోషణ, కుట్టు యంత్రాలు, చిన్న వ్యాపారాలు, ఆహార పదార్థాల తయారీ వంటి రంగాల్లో మహిళలు రుణాలు తీసుకుని స్వయం ఉపాధి అవకాశాలను పెంచుకోవాలని సూచించారు. అలాగే తీసుకున్న రుణాలను సమయానికి చెల్లించడం ద్వారా భవిష్యత్తులో మరింత పెద్ద మొత్తంలో రుణాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.అదేవిధంగా వినియోగ రుణాలను కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, అత్యవసర



పరిస్థితులు వంటి అవసరాలకే వినియోగించాలని సూచించారు. మహిళలు ఆర్థిక పరమైన అవగాహన పెంపొందించుకుని కుటుంబ అభివృద్ధిలో కీలక పాత్ర పోష

### వేసవికాలంలో కార్మికుల పని చేసే చోట

## పలు జాగ్రత్తలు పాటించాలి

### - కార్మిక శాఖ సహాయ కమీషనర్





**గోకవరం మే 12 (ప్రజా ప్రతిభ న్యూస్)**

కార్మికుల పని చేసే పని స్థలంలో చల్లని త్రాగునీరు అందుబాటులోఉంచాలి. తరచూ నీరు తాగాలని సూచించాలి.నేరుగా ఎండలో ఎక్కువసేపు పనిచేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.పనిస్థలంలో తాత్కాలిక నీడ / షెల్టర్ ఏర్పాటు చేయాలి మధ్యాహ్నం 12 గంటల నుండి 4 గంటల వరకు బహిరంగ పనులను తగ్గించాలి లేదా వాయిదా వేయాలి.కఠినమైన పనులను ఉదయం లేదా సాయంత్రం చల్లని సమయాలలో నిర్వహించాలి. ప్రతి గంట పని అనంతరం కనీసం 5 నిమిషాల విరామం తీసుకోవాలి.వాతావరణ సమాచారం కోసం టీవీ, రేడియో, పత్రికలు మరియు ఐ ఎం డి వెబ్సైట్ పరిశీలించాలి. అని కార్మిక శాఖ సహాయ కమిషనర్ తెలిపారు

# హనుమాన్ జయంతి వేడుకలు

### - పేడాడ రమణికుమారి





**మాధవధార ప్రజాప్రతభ, మే 12,**

విశాఖపట్నం మాధవధార శ్రీ శ్రీ శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం లో హనుమాన్ జయంతి వేడుకలు మాజీ వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ సనపల చంద్రమౌళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలో పేడాడ రమణికుమారి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ 50 వార్డు అధ్యక్షులు,కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల వరప్రసాద్ ,మాజీ 51 వ వార్డు కార్పొరేటర్ రొయ్య వెంకటరమణ ,ఖారవేల ఎడ్యుకేషనల్,కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పేడాడ.నరసింగరావు ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అధ్యక్షులు కంచరాన సూర్యనారాయణ,తెలుగుదేశం పార్టీ 51 వార్డు అధ్యక్షులు సనపల కీర్తి ,సనపల నరేందర్ ,నంబాల ఈశ్వరరావు ,రాంబాబు ,ఏకాంతం ,రత్నం ,సరస్వతి ,తదితరులు పాల్గొన్నారు.

## జి.కె. వీధి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### - మంత్రి సంధ్యారాణిని కోరిన ముక్కలి కల్యాణి



**గూడెం కొత్త వీధి మే 12: ప్రజా ప్రతిభ**

అల్లూరి సీతారామరాజు జిల్లా జి.కె. వీధి మండల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా టి.ఎన్ .ఎస్ .ఎఫ్ . కార్యదర్శి ముక్కలి కల్యాణి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణిని కోరారు. మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రికి వివరించారు.మండలంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కొరత, రహదారులు, తాగునీరు, విద్యా మరియు వైద్య సేవలకు సంబంధించిన సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ముక్కలి కల్యాణి తెలిపారు. వెనుకబడిన గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన నిధులు, సదుపాయాలు కల్పించాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన మంత్రి గుమ్మడి సంధ్యా రాణి మండల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో పలువురు నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంచు మేఘమా... పాల సముద్రమా..?





**గూడెంకొత్తవీధి మే 12 ప్రజా ప్రతిభ**

అల్లూరి మన్యంలో మండు వేసవిలోనూ మంచు అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కాలాలతో సంబంధం లేకుండా ఇక్కడ మంచు అందాలు అబ్బురపరుస్తాయి. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నా ఉదయం వేళ మంచు కురుస్తోంది. మంచుతోపాటు శ్వేత వర్ణంలో తెలియాడే మేఘాలు ప్రకృతి ప్రేమికులను మైమరిపిస్తున్నాయి. ఇలా అల్లూరి జిల్లా గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీ అరగడపల్లి గ్రామంలో మంగళవారం సూర్యోదయ వేళ పచ్చని కొండల మధ్య పాల నురగల్లా మేఘాలు తెలియాడుతుంటే మంచు సముద్రంలా ఆకట్టుకుంటోంది. ఈ మంచు మేఘాలు రారమ్మని పకృతి ప్రేమికులను స్వాగతిస్తున్నాయి.

## షూటింగ్ బాల్ రాష్ట్ర జట్టులో స్థానం

### - సాధించిన చౌడుపల్లి కుర్రోడు తిరుమల సాయి






**అల్లూరి జిల్లా బ్యూరో మే 12 ప్రజా ప్రతిభ**

షూట్ బాల్ రాష్ట్ర జట్టుకు అల్లూరి జిల్లాకు చెందిన ఉగ్రంగి తిరుమల సాయి త్రియాష్ ఎంపిక య్యాడు. చింతపల్లి మండలం చౌడుపల్లి గ్రామానికి చెందిన ఉగ్రంగి రత్న ప్రసాద్, రమాదేవిల కుమారుడైన తిరుమల సాయి త్రియాష్ షూట్ బాల్ క్రీడలు అద్భుత ప్రతిభ సాధించాడు. జిల్లా జోనల్ స్థాయిలో అతని ప్రదర్శన ఆకట్టుకోవడంతో రాష్ట్ర స్థాయి జట్టులోకి స్థానం సంపాదించాడు. సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్ర జట్టులోకి తిరుమల సాయి త్రియాష్ ఎంపికవ్వడంపై తల్లిదం డ్రులతో పాటు కుటుంబ సభ్యులు గ్రామస్తులు అభినందించారు. చిన్న వయసులోనే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశం రావడం పై హర్షం వ్యక్తం చేశారు. తన ప్రతిభ మెరుగుపరుచుకుని జాతీయస్థాయి పోటీలకు వెళ్లాలని లక్ష్యంతో ఉన్నట్లు తిరుమల సాయి తెలిపారు.

## విద్యాశాఖ మంత్రి లోకేష్ పర్యటన

### - ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సంధ్యారాణి



**అల్లూరి జిల్లా బ్యూరో మే 12 ప్రజా ప్రతిభ**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఈనెల 13 న పర్యటించనున్న మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం ఉదయం జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, చింతపల్లి ఏఎస్పి నవజ్యోతి మిశ్ర, జిల్లా అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు.ముందుగా హెలిపాడ్ వద్దకు చేరుకున్న జిల్లా ఇంచార్జి మంత్రి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హెలిపాడ్ నుంచి కల్యాణమండపం వరకు వెళ్లే మార్గాన్ని స్వయంగా పరిశీలించి భద్రతా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం కల్యాణ మండపాన్ని సందర్శించిన మంత్రి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.తదుపరి పాడేరు కాఫీ బోర్డు గెస్ట్ హౌస్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.. మంత్రి ఏర్పాట్లపై సంబంధిత శాఖలఅధికారులు,సిబ్బందితో టెలి కాన్ఫరెన్స్ ద్వారా పనుల ఏర్పాట్లు, పార్కింగ్, బార్కెట్ల ఏర్పాట్లు, డాక్టర్ అంశాలపై సమీక్షించిన, సంబంధిత అధికారులు సాయంత్రం 5 గంటలకు హెలిఫెడ్, వెన్యూ వద్దకు హాజరుకావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరిమాని శ్రీ పూజ ఆదేశించారు. ఐటీ మంత్రి పర్యటన ఏర్పాట్ల కార్యక్రమంలో పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, జిసిసి డైరెక్టర్ బొర్ర నాగరాజు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎండీ లే అవుట్లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**గోకవరం మే 12 (ప్రజా ప్రతిభ న్యూస్)**

తూర్పుగోదావరి జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం, గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ లే అవుట్ లోవిశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయమే కంబాల శ్రీనివాసరావు దంపతులచే అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథ రాజ్ శర్మ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకలు చేపట్టి, హనుమాన్ చాలీసా పఠనం రామనామ జపం చేసారు.ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు

## అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ అండ్ రిఫరీ విశాఖకు చెందిన కశీచరాన సూర్యనారాయణ

### - మాధవ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం



**మాధవధార, ప్రజా ప్రతిభ ,మే 12:**

అంతర్జాతీయ స్థాయిలో 40 దేశాలు కు చెందిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మన దేశం... మన రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు పథకాలు సాధిస్తూ దూసుకుపోతున్నారు. అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ అండ్ రిఫరీ విశాఖకు చెందిన కరచరానసూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ పోటీల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం (వైజాగ్) కు చెందిన వెయిట్ ఇప్పుడు క్రీడాకారులు లో హారిక, భార్గవిలు గోల్డ్ మెడల్సను సాధించగా, రాజమండ్రి చెందిన తరంగిణి అనే క్రీడాకారిణి సిల్వర్ మెడల్ సాధించినట్లు సూర్యనారాయణ తెలిపారు. ఈనెల 25 నుండి న్యూజిలాండ్ లోని సమోవాలోలో అంతర్జాతీయ ఒలంపిక్ యూత్, జూనియర్ కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్(2026) పోటీలు జరుగుతున్న సంగతి తెలిసిందే! 40 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈ అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఇండియాకు సంబంధించి, 16 మంది వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు పాల్గొని 23 మెడల్స్ సాధించినట్లు రిఫరీ సూర్యనారాయణ వెల్లడించారు.సూర్యనారాయణ కు మాధవ కళింగ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది.ఈ కార్యక్రమశీలో మాధవ కళింగ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## విశాఖలో భారీగా గంజాయి

### - స్వాధీనం చేసుకున్న ఫోర్త్ టౌన్ పోలీస్ బృందం

### - బెంగళూరుకు తరలిస్తున్న నిందితుడు

### అరెస్ట్ -9 కిలోల గంజాయి సీజ్

**విశాఖ బ్యూరో సత్య,మే 12, ( ప్రజా ప్రతిభ)**



విశాఖపట్నం ఫోర్త్ టౌన్ పరిధిలోని ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసులు ఎన్డిపిఎస్ చట్టం కింద గంజాయి అక్రమ రవాణాపై కీలక చర్య చేపట్టి బెంగళూరుకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. విశ్వసనీయ సమాచారంపై స్పందించిన ఫోర్త్ టౌన్ సి ఐ రాజేష్ ఆధ్వర్యంలోని పోలీసు బృందం 11-05-2026న శ్రీనివాస కళ్యాణ మండపం సమీపంలోని రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన పవన్ ధామా (28) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద నుండి సుమారు 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల విచారణలో ఒడిశా రాష్ట్రంలోని పడువా ప్రాంతం నుండి బెంగళూరుకు డబ్బు కోసం గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. ఈ మేరకు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఎన్డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గంజాయి రవాణా ముఠాలో ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించి అరెస్ట్ చేయడానికి పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# నొయిడా కార్మికులను విడుదల చేయాలి

## - సిఐటియు డిమాండ్

**అరకు లోయ, మే 12 ( ప్రజా ప్రతిభ):** నేషనల్ డిమాండ్స్ డే సందర్భంగా నోయిడాలో ఇటీవల అరెస్ట్ అయిన 200 మంది కార్మికులను తక్షణం విడుదల చేయాలని అల్లూరు జిల్లా సిఐటియు కార్యవర్గం డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేకంగా విధానాలను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అరకులో మంగళవారం భారీ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర సిఐటియు కార్యదర్శి ఆర్ శంకర్రావు, నొయిడా అక్రమ అరెస్టులు అన్యాయం అన్నారు. పారిశ్రామిక వేత్తలకు ప్రయోజనం కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష విధానాలను ఆయన ఖండించారు. 8 గంటల పని సమయాన్ని 12 గంటలకు పెంచారనీ, కనీస వేతన చట్టం అమలు కావడం లేదని12 గంటల పని చేయించుకుని చాలీచాలని కూలి ఇస్తూ కూడా ప్రభుత్వం కార్మికులప దౌర్జన్యానికి పాల్పడటం, అరెస్టులు చేయటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. గత నెలలో నొయిడా లోని 40 వేల మంది వలస కార్మికులు రోడ్డుమీద రోడ్డుమీద ధర్నా చేస్తుండగా ప్రభుత్వం అరెస్టు చేసిన 200 మందిని తక్షణ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ అన్యాయ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటానికై దేశ వ్యాప్త కార్మిక సంఘాలు, కార్మికులు, నాయకులు, గిరిజనులు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. జరిగిన ధర్నాలో పాల్గొన్న సిఐటియు , రాష్ట్ర కార్యదర్శి వారి శంకరరావు అల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్,




జిల్లా కోశాధికారి పోతరాజు తదితర నాయకుల్లో పాల్గొన్నారు.

# మిరియాలు సాగులో అధిక దిగుబడులు పై శిక్షణ కార్యక్రమం




**అల్లూరి జిల్లా బ్యూరో మే 12 ప్రజాప్రతిభ**

డా. వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ఉద్యాన పరిశోధనా స్థానం, చింతపల్లి మరియు భారత ప్రభుత్వ వ్యవసాయ ఓ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన సంయుక్త ఆధ్వర్యంలో పాడేరు లో మిరియాల సాగుపై రైతులకు శిక్షణా మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. టి. పద్మలత, లాం, గుంటూరు, కంటా బాల కర్ణ, జిల్లా ఉద్యాన అధికారి, కల్యాణి (సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్, స్పైసెస్ బోర్డు), కె. మనోజ్ కుమార్ (రిసెర్చ్ ఆఫీసర్) మరియు కె. తేజస్ దాస్ (సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్), డా. ప్రదీప్ కుమార్, పాడేరు, డా. వి. రమణ, సీనియర్ సైంటిస్ట్ ఓ హెడ్, డా. సతీష్, శాస్త్రవేత్త పాల్గొన్నారు. శిక్షణా కార్యక్రమంలో మిరియాల సాగులో అధిక దిగుబడులు ఇచ్చే రకాలు, సేంద్రీయ వ్యవసాయం ద్వారా పోషక యాజమాన్యం, వర్మీ కంపోస్ట్ మరియు ద్రవరూప జీవన ఎరువుల వినియోగం, ట్రైకోడెర్మా ద్వారా మొదలు కుళ్లు తెగులు నివారణ, వేప నూనె ద్వారా రసం పీల్చే పురుగుల యాజమాన్యం వంటి అంశాలపై రైతులకు సాంకేతిక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వివిధ స్వచ్ఛంద సంస్థలు అయిన విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్, వాసన్, సి.ఎస్.ఎం ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే పాడేరు మరియు సమీప ప్రాంతాలకు చెందిన మిరియాల సాగు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు.

# జిల్లాను సమాగ్రాభివృద్ధి చేయడంలో పాలకుల నిర్లక్ష్యం వీడాలి!

## - జిల్లా ప్రథమ మహాసభలో కామ్రేడ్ తోట జీవన్న మరోసారి జిల్లా కార్యదర్శి గా ఏకగ్రీవ ఎన్నిక!

**అరకు లోయ, మే 12 ( ప్రజా ప్రతిభ):** జిల్లాను సమాగ్రాభివృద్ధి చేయడంలో పాలకుల నిర్లక్ష్యం వీడి జిల్లాను అభివృద్ధి చేయాలని సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్న అన్నారు. సిపిఐ ఎమ్ ఎల్ రెడ్ స్టార్ జిల్లా ప్రథమ మహాసభ లో కామ్రేడ్ తోట జీవన్న ను మరోసారి ఏకగ్రీవంగా జిల్లా కార్యదర్శి ఎన్నికైన అనంతరం మాట్లాడుతూ,, జిల్లాలో సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ పార్టీ ఏర్పడి 8 నెలలు గడుస్తున్నప్పటికీ ఈ ఎనిమిది నెలల్లో ప్రజల సమస్యలపై గల మెత్తడమే కాకుండా కొన్ని కీలక సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రులకు సంబంధిత శాఖ మంత్రులకు పార్టీ ఆధ్వర్యంలో లేఖ రాస్తూ సమస్యల పరిష్కారం కోసం ముందుకెళ్లడం జరుగుతుంది. జిల్లా ప్రథమ మహాసభ సందర్భంగా జిల్లా సమగ్ర అభివృద్ధికి, కొన్ని సమస్యల పరిష్కారం కై జిల్లా మహాసభలో నివేదికతో పాటుగా తీర్మానాలు కూడా ప్రవేశపెట్టి వాటి సాధనకు పార్టీ యావత్తు కథలాలని తీర్మానించడం జరిగింది. మన్యం జిల్లా మీదుగా నదులు గడ్డలు పారుతున్న "అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని ఉన్నట్లు" జిల్లాలో ఇంతవరకు పరిపాలిస్తున్న పాలకులు వాటిని దోసిట్లో పెట్టి పొలాలకు మళ్లించడంలో విఫలమయ్యారని అన్నారు. ఇప్పటికే ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు చిన్న చిన్న గెడ్డలపై మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యాములు నిర్మాణం చేపట్టినట్లయితే మన్యం జిల్లా మరో కోనసీమ జిల్లాగా మారే అవకాశాలు మెశీడిగా ఉన్నాయని అన్నారు. అలాగే జిల్లాలో అనేక సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ప్రధానంగా ఏనుగులు సమస్య రెండు గుంపులుగా సంచారిస్తూ పంటలను, ఆస్తులను ద్వశీసం చేస్తూ, ఎదురొచ్చిన మనుషులను చంపుతూ చేస్తుంటే ఈ సమస్య పరిష్కరించకుండా తాత్సర్యం జరుగుతుందని అన్నారు. గిరిజన గురుకుల సంక్షేమ హాస్టల్ లో చదువుతున్న బాల బాలికలు సాధారణమైన జ్వరాలతో పిట్టల రాలిపోతుంటే,గురుకుల సంక్షేమ హాస్టల్ లో ఉన్న సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నారు . కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరుమాసాల్లోనే హాస్టల్లో ఏఎన్ఎం లను నియమిస్తామన్న హామీ గాలికి కొట్టుకుపోయింది అన్నారు. ఏళ్ల తరబడి ఒరిస్సా ఆంధ్రకు సరిహద్దు ఉన్న జంఝావతి ప్రాజెక్ట సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేయడం తగదు ఒరిస్సా ప్రభుత్వంతో ఆంధ్ర ప్రభుత్వం చర్చలు జరిపి జంఝావతి ప్రాజెక్టును పూర్తిచేసి జిల్లాకు తాగునీరు సాగునీరు వచ్చే విధంగా ప్రయత్నించాలి. జిల్లాకు చివరనున్న జంపర్లకోట ప్రాజెక్టును పూర్తిగా కాకుండా కాలయాపన చేయడం జరుగుతుంది . తోటపల్లి ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలను శుభ్రం చేసి కాలువల ద్వారా చివరి రైతు వరకు నీరు అందించడానికి ప్రయత్నాలు చేయడం లేదు. సాలూరు నియోజకవర్గ పరిధిలో కొటియా బెల్ట్ గ్రామాలు గిరిజన యువకులపై ఒరిస్సా పోలీసులు దౌర్జన్యాలు చేస్తు, అరెస్టు చేసి జైల్లో పెట్టినప్పటికీ, కొటియా బెల్ట్ గ్రామాల సమస్యను పరిష్కరించడంలో కాలయాపన జరుగుతుందన్నారు. పార్వతీపురం,,సాలూరు మున్సిపాలిటీలలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 15% పన్నులు పెంచుతూ, పట్టణ ప్రజలపై భారం మోపుతుంది. జిల్లాలో ఉన్న పాలకులు వెంటనే స్పందించి మున్సిపాలిటీలలో పెంచిన పన్ను లను తగ్గించడానికి ప్రయత్నం చేయాలని,







మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య పనులు, మౌలిక సదుపాయాలు, మంచినీటి పంపిణీ సకాలంలో చేయడంలో నిర్లక్ష్యం వీడాలని అన్నారు. గత మూడు నాలుగు సంవత్సరాలుగా జీడి మామిడి పంటలు దిగుబడి రాక జీడి మామిడి పండించే రైతులు తీవ్రంగా నష్టపోయారు. అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చినను ఈ సమస్య పరిష్కారంనకు నోచుకోవడం లేదు. జిల్లాలో "డోలీ"సమస్య తీవ్రంగా ఉన్నది. పాలకులు డోలి సమస్య తీరిందని పత్రికలో ప్రకటనలు గుప్పించినప్పటికీ ప్రతి వారం ఒక "డోలి" సమస్య వెలుగులోకి రావడం పాలకుల డొల్లతనానికి నిదర్శనం అన్నారు. పూర్ణపాడు లాగేసు వంతెన పూర్తి కాకపోవడంతో అటు నది అవతల ఉన్న ప్రజలు జిల్లా కేంద్రముతో సంబంధాలు తెగిపోవడంతో కష్టసుఖాల్లో జిల్లా కేంద్ర రావడానికి ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్ణపాడు లాభేసు వంతెన పూర్తి చేయడానికి పాలకులు ప్రయత్నం చేయాలి. జిల్లాలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల రెగర్డింగ్ ఇల్లు నిర్మాణం చేయాలి. గిరి శిఖర గ్రామాల్లో ఇళ్ళు అనేకమంది గిరిజనులు గుడిసెలు వేసుకొని నివసించడం జరుగుతుంది వారందరికీ కూడా ఇళ్ల స్థలాల కేటాయించాలని,గిరిశిఖర గ్రామాలకు రోడ్లు నిర్మించి రాకపోకలు జరిగేటట్లు జిల్లా పాలకులు ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ పార్టీ జిల్లా ప్రథమ మహాసభ జయప్రదంగా ముగించి, ఉద్యమ అవసర...9మందితో జిల్లా కార్యదర్శి వర్గం ఓ 7గురితో జిల్లా కార్యవర్గమును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జిల్లా కార్యదర్శి వర్గం తోట జీవన్న,గరుగుబిల్లి సూరయ్య, బొత్స మోహనరావు, అరినామ సీతమ్మ, గుజ్జ జనార్ధన, బిడ్డక రమణ మూర్తి, బీటి నాయుడు, పత్తిక మోహన్ రావు,,పాడి చిరంజీవి లు ఓకార్యవర్గంగా మండంగి సింహాచలం ఎమ్ కళ్యాణి, లశీగయ్య, గరుగుబిల్లి వెంకటమ్మ, బిడ్డిక సంధ్య, మారడాన జగన్నాధం, పాలకొండ ప్రభాకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది,

# గ్యాస్ బండ బాధలు... తప్పని బారులు




**గూడెం కొత్తవీధి మే 12 ప్రజా ప్రతిభ**

వంట గ్యాస్ కోసం గూడెం కొత్తవీధి మండల వినియోగదారులు అవస్థలకు గురవుతున్నారు.. సకాలంలో గ్యాస్ సిలిండర్లు రాకపోవడంతో ఒక్కసారిగే వచ్చే బండల బారులు తీరుతున్నారు. జికే వీధి మండలంలో వంట గ్యాస్ వినియోగదారులకు సిలిండర్ సరఫరా చేసేలా ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా హెచ్పి సంస్థ సేవలు అందిస్తోంది. అయితే గత రెండు నెలలుగా వంట గ్యాస్ కొరత తీవ్రం కావడంతో సకాలంలో గ్యాస్ సరఫరా చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాస్తవానికి ఎప్పటికప్పుడు నిర్వాహకులు సిలిండర్లు గోధుమ కు రప్పించాల్సి ఉన్నా నెలకోసారి, రెండు నెలలకు ఒకసారి గ్యాస్ సిలిండర్ లు రప్పించడంతో వాటికోసం వినియోగదారులు ఎగబడుతున్నారు. గత 20 రోజుల కిందట 320 బండలు నిర్వాహకులు తీసుకురాగా రెండు రోజుల్లోనే అవి అమ్ముడుపోయాయి. వెంటనే సిలిండర్లు రప్పించాల్సి ఉన్నా నిర్వాహకులు జాప్యం కారణంగా ఆలస్యం అవుతోంది. ఇరవై రోజుల తర్వాత మంగళవారం 300 సిలిండర్లు రావడంతో వాటిని విడిపించుకునేందుకు గోదాము వద్ద వినియోగదారులు ఎగబడ్డారు. మధ్యాహ్నం నుంచి గంటల తరబడి బారులు తీరారు.

# కలగొట్ల వారి వివాహ వేడుకలో అన్నా రాంబాబు



**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి , మే 12,(ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా, గిద్దలూరు నియోజకవర్గం,కంభం మండలం, జంగంగుంట్ల గ్రామంలో కలగొట్ల కుటుంబ వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. కలగొట్ల గోపాల్, సుబ్బమ్మ దంపతుల కుమార్తె రమాదేవి వివాహ వేడుకకు గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. గ్రామీణ వాతావరణంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వివాహ వేడుకకు పరిసర ప్రాంతాల నుంచి బంధువులు, అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వివాహ మండపం సందడిగా మారగా, కుటుంబ సభ్యులు అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ, కుటుంబ బంధాలు, సంప్రదాయ విలువలు సమాజానికి బలమని పేర్కొన్నారు. కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న వధూవరులు ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలతో ఆప్యాయ అనుబంధం కొనసాగించడం తనకు ఎప్పటికీ ఆనందాన్నిస్తుందని తెలిపారు. వివాహ వేడుకలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నా రాంబాబును పలువురు అభిమానులు కలుసుకుని అభివాదం చేశారు. కార్యక్రమం మొత్తం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

# తర్లుపాడు విద్యాశాఖ కార్యాలయానికి కూలర్ల విరాళం

## - తల్లిదండ్రుల స్మారకార్థం దాతల సేవాభావం..




**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి , మే 12,(ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా, తర్లుపాడు మండల విద్యాశాఖ కార్యాలయానికి దాతలు కూలర్లను విరాళంగా అందజేసి సేవాభావాన్ని చాటుకున్నారు. మండలంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, కార్యాలయానికి వచ్చే ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ సహాయం అందించారు. కీర్తిశేషులు గాయం వెంకట రామిరెడ్డి, సీతామహాలక్ష్మమ్మ స్మారకార్థం వారి కుమార్తెలు జంకే విజయలక్ష్మి సరస్వతి, వెన్నా ఇందిర, ఉడుముల పద్మ, ఉడుముల సరస్వతి ఈ కూలర్లను అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు ఉండాలనే ఉద్దేశంతో ఈ విరాళం అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దాతలు అందజేసిన కూలర్లను మండల విద్యాశాఖ అధికారులు దేవరకొండ సుజాత, అచ్యుత్ సుబ్బారావు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేసవి కాలంలో కార్యాలయానికి వచ్చే ప్రజలు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ఈ కూలర్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సమాజం పట్ల బాధ్యతతో ముందుకు వచ్చిన దాతల సేవా భావం అభినందనీయమని అన్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ కార్యాలయానికి అవసరమైన వస్తువులను అందించడం ఆదర్శనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# హనుమజ్జయంతి వేడుకల్లో అన్నా రాంబాబు..

## - మార్కాపురం, కొనకనమిట్లలో ప్రత్యేక పూజలు..



**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి , మే 12,(ప్రజా ప్రతిభ):**

హనుమజ్జయంతి సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఈ సందర్భంగా గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మార్కాపురం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించిన అన్నా రాంబాబు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కొనకనమిట్ల మండలం పుట్లూరివారిపల్లె అరుగు వద్ద నిర్మించిన శ్రీ రామదూత క్షేత్రాన్ని కూడా ఆయన సందర్శించారు. హనుమజ్జయంతి పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అన్నా రాంబాబుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు, హారతులు నిర్వహించారు. భక్తులతో కలిసి అన్నా రాంబాబు పూజల్లో పాల్గొని, రాష్ట్ర ప్రజలకు శాంతి, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు. హనుమంతుడి భక్తి, ధైర్యం, సేవా భావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

https://prajaprathibha.com RNI: APTEL 2013/54721
ప్రజా ప్రతిభ
ప్రతి అక్షరం ప్రజా పక్షం తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts


## తర్లుపాడు అదనపు తహసీల్దార్‌గా

# చిరంజీవి బాధ్యతల స్వీకరణ..

**- రెవెన్యూ సేవలు ప్రజలకు చేరేలా కృషి చేస్తానన్న చిరంజీవి..**

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి , మే 12,(ప్రజా ప్రతిభ):

తర్లుపాడు మండల పూర్తి అదనపు బాధ్యతల తహసీల్దార్‌గా మార్కాపురం మండల తహసీల్దార్ చిరంజీవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు.బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాలయ సిబ్బందితో చిరంజీవి సమావేశమై మండల పరిధిలో కొనసాగుతున్న రెవెన్యూ వ్యవహారాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు సంబంధించిన సేవలు ఎలాంటి ఆలస్యం లేకుండా అందించాలని, కార్యాలయ పనితీరు పారదర్శకంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా మండల రెవెన్యూ సిబ్బంది చిరంజీవిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కొత్త బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యాలయంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది.చిరంజీవి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. భూముల సమస్యలు, ధృవపత్రాల జారీ, రెవెన్యూ పరమైన ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేసే విషయంలో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.మండల అభివృద్ధికి రెవెన్యూ శాఖ కీలకంగా పనిచేస్తుందని, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పుడు ఇబ్బందులు పడకుండా సత్వర సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.



# హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొన్న కేపీ.నాగార్జునరెడ్డి

**కొమరోలులో వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు..**

మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 12,(ప్రజా ప్రతిభ):

హనుమజ్జయంతి సందర్భంగా కొమరోలు పట్టణంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి కె.పి. నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వేదమంత్రాల నడుమ ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి స్వామివారికి ప్రత్యేక మొక్కులు చెల్లించి రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు.ఆలయ కమిటీ సభ్యులు నాగార్జునరెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికారు. భక్తులతో కలిసి హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు భజనలు, జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిపోయాయి. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ, హనుమంతుడు భక్తి, ధైర్యం, సేవాభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, ధర్మం, నైతిక విలువలు పెంపొందాలని ఆకాంక్షించారు. యువత హనుమంతుడి జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు.పట్టణంలోని ప్రధాన వీధుల్లో భక్తులు కాషాయ జెండాలతో ర్యాలీలు నిర్వహించారు.ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు, పానక పంపిణీలు చేపట్టారు. మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, మండల కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు



పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వర్గీయ రామిరెడ్డికి నివాళులర్పించిన కేపీ. నాగార్జునరెడ్డి

**- సింగరపల్లిలో దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్సీపీ నాయకులు..**



మార్కాపురం జిల్లా బ్యూరో /లుంజల శేఖర్ , మే 12,(ప్రజా ప్రతిభ):

మార్కాపురం జిల్లా, బేస్తవారిపేట మండలం, సింగరపల్లి గ్రామానికి చెందిన వెండిదండి జయచంద్ర భానురెడ్డి తండ్రి రామిరెడ్డి ఇటీవల పరమపదించారు. వారి దశదిన కర్మ కార్యక్రమంలో గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి కె.పి. నాగార్జునరెడ్డి పాల్గొని నివాళులర్పించారు. స్వర్గీయ రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన నాగార్జునరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ, రామిరెడ్డి గ్రామంలో అందరితో ఆప్యాయంగా మెలిగే వ్యక్తిగా మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా గ్రామానికి కూడా తీరని లోటని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.దశదిన కర్మ కార్యక్రమానికి బంధువులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం విషాద వాతావరణంలో సాగింది.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొన్న కేపీ.కొండారెడ్డి

**- తర్లుపాడు రోడ్డులోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు..**



మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 12,(ప్రజా ప్రతిభ):

హనుమజ్జయంతి సందర్భంగా మార్కాపురం పట్టణం భక్తి శోభతో కళకళలాడింది. పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సీనియర్ రాజకీయ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐడీసీ మాజీ చైర్మన్, మార్కాపురం మాజీ శాసనసభ్యుడు కే.పి. కొండారెడ్డి పాల్గొన్నారు.ఉదయం నుంచే ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేదమంత్రాల నడుమ ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. కొండారెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కొండారెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఆలయ పరిసరాలు "జై శ్రీరామ్", "జై హనుమాన్" నినాదాలతో మార్మోగిపోయాయి. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.హనుమజ్జయంతి సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు పానకం, మజ్జిగ, ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ, హనుమంతుడు భక్తి, ధైర్యం, సేవాభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. యువత ధర్మం, క్రమశిక్షణ, సేవా దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. సమాజంలో శాంతి, ఐక్యత నెలకొనాలని ఆకాంక్షించారు.సాయంత్రం వరకు ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ కొనసాగింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## గొట్లగట్టులో మిన్నంటిన హనుమాన్ జయంతి వేడుకలు

మార్కాపురం జిల్లా ప్రతినిధి / కొండ్రు వెంకటేశ్వర్లు,మే 12( ప్రజా ప్రతిభ)

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గొట్లగట్టు శ్రీ అభయ వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. స్వామివారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తెల్లవారుజాము నుండే ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించారు.ఉదయం నుండే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హనుమంతునికి పంచామృతాలతో, అభిషేకం,సింధూర పూజ మరియు ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం "జై శ్రీరామ్", "జై హనుమాన్" అనే నామస్మరణలతో మారుమోగింది. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీగా అన్నదాన సౌకర్యం కల్పించారు. భజన బృందాల కోలాటాలు, భక్తుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, స్థానిక



ప్రజాప్రతినిధులు మరియు పరిసర ప్రాంతాల నుండి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## బైపాస్ శస్త్రచికిత్స చేయించుకున్న దద్దనాల కృష్ణారెడ్డిని పరామర్శించిన నాగార్జునరెడ్డి..



మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 12,(ప్రజా ప్రతిభ):

మార్కాపురం జిల్లా, అర్ధవీడు మండలం, అయ్యవారిపల్లె పంచాయతీ మద్దలమడక గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు దద్దనాల కృష్ణారెడ్డి ఇటీవల బైపాస్ శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మార్కాపురం మాజీ శాసనసభ్యుడు, గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి కె.పి. నాగార్జునరెడ్డి మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.కృష్ణారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నాగార్జునరెడ్డి, వైద్యుల సూచనలను పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకుని మునుపటిలాగే ప్రజల్లో చురుకుగా తిరగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా నిలబడటం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకుల ఆరోగ్యం పట్ల పార్టీ ఎప్పుడూ శ్రద్ధ చూపుతుందని తెలిపారు.నాగార్జునరెడ్డి రాకతో గ్రామంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆయనకు స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న కేపీ.నాగార్జునరెడ్డి..

**- నూతన వధూవరులకు ఆశీస్సులు అందించిన వైఎస్సార్సీపీ ఇంచార్జి**



మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 12,(ప్రజా ప్రతిభ):

మార్కాపురం జిల్లా, గిద్దలూరు నియోజకవర్గ పరిధిలో జరిగిన పలు వివాహ ముహూర్తపు కార్యక్రమాల్లో గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇంచార్జి కె.పి. నాగార్జునరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పార్టీ నాయకులతో కలిసి ఆత్మీయంగా పాల్గొన్నారు. గిద్దలూరు మండలం బురుజుపల్లి ధురుచింతల తండాకు చెందిన దుమావత్ మంత్రి నాయక్, గౌరిభాయి దంపతుల కుమారుడు చంద్ర నాయక్ వివాహ ముహూర్తపు కార్యక్రమానికి నాగార్జునరెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. తండా ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వివాహ మండపంలో సందడి నెలకొంది.అనంతరం కొమరోలు మండల కేంద్రంలో జరిగిన ఇమ్మడిశెట్టి కుటుంబ వివాహ కార్యక్రమానికి కూడా ఆయన హాజరయ్యారు. ఇమ్మడిశెట్టి కేశవరావు, సుబ్బమ్మ దంపతుల కుమారుడు చంద్రశేఖర్, శ్రీలక్ష్మిల వివాహ ముహూర్తపు కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయంగా ముచ్చటించారు.ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ, కుటుంబ బంధాలు, సంప్రదాయ విలువలు సమాజానికి బలమని పేర్కొన్నారు. కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న వధూవరులు ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలతో ఎప్పటికప్పుడు అనుబంధం కొనసాగించడం సంతోషంగా ఉందన్నారు.రెండు కార్యక్రమాల్లోనూ స్థానిక నాయకులు, వైఎస్సార్సీపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివాహ వేడుకలు ఆత్మీయ వాతావరణంలో ఘనంగా సాగాయి.

## మెండ్రగుత్తి వారి వివాహ వేడుకలో అన్నా రాంబాబు..

**- నూతన వధూవరులకు ఆశీస్సులు అందించిన వైఎస్సార్సీపీ ఇంచార్జి..**



ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి , మే 12,(ప్రజా ప్రతిభ):

మార్కాపురం పట్టణంలోని కె.ఆర్. గ్రాండ్‌లో మెండ్రగుత్తి వారి వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మెండ్రగుత్తి దిబ్బయ్య, మల్లేశ్వరి దంపతుల కుమారుడి వివాహ మహోత్సవంలో పాల్గొన్న అన్నా రాంబాబు, వధూవరులు గ్రేష్మారాయ్, శివలకు శుభాకాంక్షలు తెలియజేశారు.కొత్త జీవితాన్ని ఆనందంగా, ఆయురారోగ్యాలతో కొనసాగించాలని ఆకాంక్షించారు.వివాహ మండపానికి చేరుకున్న అన్నా రాంబాబుకు కుటుంబ సభ్యులు, అభిమానులు ఆత్మీయ స్వాగతం పలికారు. వివాహ వేడుకలో బంధువులు, స్నేహితులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కె.ఆర్. గ్రాండ్ సందడిగా మారింది.ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ, కుటుంబ బంధాలు సమాజానికి బలమని పేర్కొన్నారు.వివాహం అనేది రెండు కుటుంబాల కలయిక మాత్రమే కాకుండా, విలువలు, సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లే పవిత్ర బంధమని అన్నారు. యువత కుటుంబ బాధ్యతలను గౌరవిస్తూ సమాజంలో ఆదర్శంగా నిలవాలని సూచించారు.వివాహ వేడుకలో వధూవరులతో కలిసి పలువురు ఫోటోలు దిగగా, ఆత్మీయ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైఎస్సార్సీపీ కార్యకర్తలు, అభిమానులు, బంధువులు పాల్గొన్నారు.

# శ్రీశైలం ఘాట్‌లో వరుస ప్రమాదాలు..

# లోయలోకి దూసుకెళ్లిన బస్సు..

## - తృటిలో తప్పిన ప్రాణాపాయం,, రక్షణ కమ్మీలను ఢీకొట్టి ఆగిన మరో బస్సు..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి , మే 12,(ప్రజా ప్రతిభ):

నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలం ఘాట్‌రోడ్డులో సోమవారం సాయంత్రం వరుసగా జరిగిన రెండు బస్సు ప్రమాదాలు ప్రయాణికులను భయాందోళనకు గురిచేశాయి. వర్షపు జల్లులు, ఘాట్‌రోడ్డులో జారుడు పరిస్థితులు, వేగం కలిసి ప్రమాదానికి కారణమైనట్లు తెలుస్తోంది. రెండు ఘటనల్లోనూ పెను ప్రమాదం తృటిలో తప్పింది.మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం నుంచి దోర్నాల వైపు ప్రయాణిస్తోంది. ఘాట్‌రోడ్డులో ఎదురుగా వస్తున్న వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో బస్సు రోడ్డు మార్జిన్ వైపు దిగింది. అదే సమయంలో అక్కడ వర్షం పడుతుండటంతో రోడ్డు జారుడుగా మారింది. వేగంగా వెళ్తున్న బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇనుప రిటైనింగ్ గోడను ఢీకొట్టి లోయ వైపు దూసుకెళ్లింది.బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉండగా, ఒక్కసారిగా బస్సు లోయ వైపు జారిపోవడంతో ప్రయాణికులు కేకలు వేస్తూ భయంతో వణికిపోయారు. అయితే, లోయ అంచున ఉన్న భారీ చెట్లను ఢీకొట్టి బస్సు అక్కడే నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేకపోతే మరింత ఘోర ప్రమాదం జరిగేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.ఈ ఘటనతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్థానికులు, అటవీ సిబ్బంది, ప్రయాణికులు కలిసి బస్సులో ఉన్న వారిని బయటకు తీసుకొచ్చారు.కొంతమందికి స్వల్ప గాయాలు కావడంతో సమీప ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ఇదే సమయంలో ఆ బస్సు వెనుక వస్తున్న ఇంద్ర బస్సు కూడా ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయింది. ముందున్న బస్సు ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై వాహనాన్ని అదుపు చేయడానికి ప్రయత్నించాడు.అయినప్పటికీ బస్సు రోడ్డు పక్కన ఉన్న రక్షణ ఇనుప కమ్మీలను ఢీకొట్టి ఆగిపోయింది. ఈ బస్సులో ఉన్న 12 మంది ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘాట్‌రోడ్డులో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం క్రేన్ల సహాయంతో ప్రమాదానికి గురైన బస్సులను బయటకు తీసే పనులు ప్రారంభించారు.వర్షాకాలంలో శ్రీశైలం ఘాట్‌రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ,



భద్రతా చర్యలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘాట్‌రోడ్డులో వేగ నియంత్రణ, రక్షణ గోడల బలోపేతం, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు వంటి చర్యలు తక్షణమే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మార్కాపురం బస్టాండ్ క్యాంటీన్లపై ఫిర్యాదు..

## - అధిక ధరల వసూళ్లు,

## వినియోగదారులపై దురుసు ప్రవర్తన ఆరోపణలు..



మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 12,(ప్రజా ప్రతిభ):

మార్కాపురం, ఆర్టీసీ బస్టాండ్‌లోని క్యాంటీన్ల వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. బస్టాండ్‌లో నిర్వహిస్తున్న రఫీ క్యాంటీన్‌లో వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారంటూ జిల్లా కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు అందింది. క్రిమినల్ అడ్వకేట్ అజిత్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదులో, నీటి బాటిళ్లు, కూల్‌డ్రింక్స్, స్నాక్స్ వంటి వస్తువులను ముద్రిత ధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. సాధారణ ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని అధిక ధరలు వసూలు చేస్తూ దోపిడీ కొనసాగిస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికే ఈ వ్యవహారంపై పలు సందర్భాల్లో పోలీస్ కేసులు నమోదైనప్పటికీ, క్యాంటీన్ యాజమాన్యం తీరు మారలేదని ఫిర్యాదులో వెల్లడించారు. ధరలపై ప్రశ్నించిన వినియోగదారులను దుర్భాషలాడటం, బెదిరింపులకు పాల్పడటం జరుగుతోందని ఆరోపించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే మార్కాపురం బస్టాండ్‌లో ఇలాంటి పరిస్థితులు కొనసాగడం ఆందోళన కలిగిస్తోందని ప్రజలు చెబుతున్నారు.ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీరు, శీతల పానీయాల అవసరం పెరిగిన సమయంలో అధిక ధరలు వసూలు చేయడం పేద, మధ్యతరగతి ప్రయాణికులపై అదనపు భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వస్తువులు విక్రయించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని క్యాంటీన్లు నిబంధనలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బస్టాండ్ పరిధిలో ధరల పట్టికలు స్పష్టంగా ప్రదర్శించకపోవడం కూడా సమస్యగా మారిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఫిర్యాదు నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రయాణికుల హక్కులను పరిరక్షించేలా కఠిన చర్యలు అవసరమని అభిప్రాయపడుతున్నారు.

# త్రిపురాంతకంలో భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా ఆంజనేయస్వామి శోభాయాత్ర



యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జి/ డి ప్రసాద్ రెడ్డి, మే12,(ప్రజా ప్రతిభ).

మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలం హనుమాన్ శోభ యాత్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంజనేయస్వామి శోభాయాత్ర మంగళవారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు, హారతులతో ప్రారంభమైన ఈ శోభాయాత్రలో యువత భారీగా పాల్గొని కాషాయ జెండాలు పట్టుకుని భక్తి నినాదాలతో పట్టణాన్ని మార్మోగించారు.పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగిన యాత్రలో భజనలు, డప్పుల వాయిద్యాలు, మంగళహారతులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు, చిన్నారులు, వృద్ధులు సహా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మార్గమధ్యంలో భక్తులకు తాగునీరు, ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగేందుకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా, నిర్వాహకులు యాత్రను విజయవంతంగా నిర్వహించారు.

# కోడిపందాలు ఆడుతున్న నలుగురు అరెస్టు



నాతవరం, మే,12,(ప్రజా ప్రతిభ)

కోడిపందాలు ఆడుతున్న నలుగురుని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 650 రూపాయలు నగదు 2 కోడి పుంజులు స్వాధీన పరుచుకున్నామని నాతవరం ఎస్సై వై ,తారకేశ్వరరావు తెలిపారు చమ్మచింత పంచాయితీ శివారు పి,ఎస్,డి పాలెం గ్రామ శివారులోజీడి తోటలో కోడి పందాలు ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో దాడిచేసి కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు, కానిస్టేబుల్ లోవరాజు ఉన్నారు

# జై శ్రీరామ్ నినాదాలతో జ్వలించిన మార్కాపురం..

## - హనుమజ్జయంతి వేడుకల్లో ఉప్పొంగిన ఆధ్యాత్మిక జోష్..

## - కాషాయ తరంగంగా మారిన పట్టణం..

## హనుమాన్ శోభాయాత్రలో అన్నా రాంబాబు..



ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి , మే 12,(ప్రజా ప్రతిభ):

హనుమజ్జయంతి సందర్భంగా మార్కాపురం పట్టణం భక్తి పారవశ్యంతో ఊగిపోయింది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు "జై శ్రీరామ్", "జై హనుమాన్", "సీయావర రామ్ చంద్ర కీ జై" నినాదాలతో పట్టణమంతా దద్దరిల్లిపోయింది. ప్రతి వీధి కాషాయ కాంతులతో మెరిసిపోగా, ఆలయాలు భక్తజన సముద్రంగా మారాయి.మార్కాపురం మొత్తం ఒక మహా ఆధ్యాత్మిక క్షేత్రంలా దర్శనమిచ్చింది.తెల్లవారుజామునే ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తుల రద్దీ మొదలైంది. గంటల శబ్దాలు, వేద మంత్రాలు, భజనలు, డప్పు వాయిద్యాలతో పట్టణం మార్మోగిపోయింది. స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, పుష్పాలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. కిలోమీటర్ల మేర క్యూలైన్లలో నిలబడి భక్తులు దర్శనం కోసం ఎదురుచూశారు.మార్కాపురం ప్రధాన రహదారులన్నీ కాషాయ జెండాలతో రెపరెపలాడాయి. భారీ హనుమాన్ చిత్రపటాలు, విద్యుత్ వెలుగులు, ఫ్లెక్సీలు పట్టణానికి ప్రత్యేక శోభ తీసుకొచ్చాయి. యువత వందలాది బైక్‌లతో నిర్వహించిన ర్యాలీలు పట్టణాన్ని హోరెత్తించాయి. "జై శ్రీరామ్" నినాదాలతో గాలే కంపించినట్లు కనిపించింది.హనుమాన్



దీక్షలు చేపట్టిన భక్తులు 41 రోజుల కఠిన నియమ నిష్టల అనంతరం నేడు దీక్ష విరమించారు. కాషాయ వస్త్రాలు ధరించి, చేతుల్లో జెండాలు పట్టుకుని ఆలయాలకు చేరుకున్న భక్తులు హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణాలతో భక్తి వాతావరణాన్ని మరింత ఉద్ధృతం చేశారు.తమల పాకులు, సింధూరం, వడమాలలు, బెల్లం సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు.పట్టణంలోని ప్రతి వీధిలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పానకం, మజ్జిగ, శీతల పానీయాల పంపిణీతో సేవా కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ భక్తి ఉత్సాహంలో మునిగిపోయారు. మహిళలు దీపారాధనలు నిర్వహిస్తూ స్వామివారిని ప్రార్థించారు.సాయంత్రం జరిగిన మహా హనుమాన్ శోభాయాత్ర వేడుకలకు హైలైట్‌గా నిలిచింది. విద్యుత్ కాంతులతో అలంకరించిన భారీ హనుమాన్ విగ్రహాలను ప్రత్యేక రథాలపై ఊరేగించారు. డప్పు కళాకారులు, భజన బృందాలు, యువత నృత్యాలు, హనుమాన్ వేషధారణలు ప్రజలను ఆకట్టుకున్నాయి. పట్టణ వీధులన్నీ కాషాయ జనసంద్రంగా మారిపోయాయి.ఈ మహా శోభాయాత్రలో మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తులతో కలిసి జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ ముందుండి శోభాయాత్రలో నడిచారు. ఆయన రాకతో కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పలుచోట్ల యువత పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికింది.మార్కాపురం మాత్రమే కాదు, పరిసర గ్రామాలన్నీ హనుమజ్జయంతి వేడుకలతో కాషాయమయమయ్యాయి. గ్రామ దేవాలయాలు విద్యుత్ దీపాలతో వెలుగొందాయి. ప్రతి గ్రామంలో ఊరేగింపులు, భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమంతుడు భక్తి, బలం, ధైర్యం, సేవాభావానికి ప్రతీక అని అర్చకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి, సుభిక్షం, ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి వరకు మార్కాపురం పట్టణం "జై శ్రీరామ్" నినాదాలతో మారుమోగుతూనే ఉంది.

# గల్ఫ్‌లో చిక్కుకున్న తెలుగు కార్మికుడికి అండగా నిలిచిన గల్ఫ్ జనసేన

## - దుబాయ్‌లో వేధింపులకు గురైన శ్రీకాకుళం వాసికి స్వదేశానికి సురక్షితంగా చేర్చిన గల్ఫ్ జనసేన బృందం। మంత్రులకు ఫిర్యాదు చేసినా స్పందించని కంపెనీపై జనసేన ఎగ్జిక్యూటివ్ టీమ్ చొరవ




నక్కపల్లి , మే 12, (ప్రజా ప్రతిభ) :

దుబాయ్‌లోని ఓ ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ యాజమాన్య వేధింపులకు గురై, స్వదేశానికి రాలేక సతమతమవుతున్న శ్రీకాకుళం జిల్లా కార్మికుడిని గల్ఫ్ జనసేన ఎగ్జిక్యూటివ్ టీమ్ సురక్షితంగా స్వదేశానికి పంపించింది.

అసలేం జరిగింది:శ్రీకాకుళం జిల్లా, కరపాడు గ్రామానికి చెందిన కొంతాల నారాయణ తండ్రి గంగయ్య ఉపాధి కోసం దుబాయ్‌లోని ఓ ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో చేరారు. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత కంపెనీ యాజమాన్యం వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసింది. ఈ క్రమంలోనే నారాయణ తల్లి మృతి చెందారు. విషయం తెలుసుకున్న నారాయణ తనను భారత్‌కు పంపించాలని కంపెనీని వేడుకోగా యాజమాన్యం నిరాకరించింది. దీంతో ఉద్యోగానికి రాజీనామా చేసినప్పటికీ కంపెనీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా పని చేయాలని ఒత్తిడి తెచ్చింది.

**ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం:**

దిక్కుతోచని స్థితిలో నారాయణ తన జిల్లా నాయకుల ద్వారా భారత ఎంబసీతో పాటు కేంద్ర మంత్రి




కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌లకు ఈ-మెయిల్స్ పంపారు. అయినప్పటికీ కంపెనీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. స్వదేశానికి పంపేందుకు యాజమాన్యం ముందుకు రాలేదు.

**రంగంలోకి దిగిన గల్ఫ్ జనసేన:**

తీవ్ర మనోవేదనకు గురైన నారాయణ తన బాధను గల్ఫ్ జనసేన ఎగ్జిక్యూటివ్ టీమ్ దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న గల్ఫ్ జనసేన ఇంచార్జ్ కేశరి త్రిమూర్తులు వెంటనే టీమ్ సభ్యులకు సమాచారం అందించారు. బాధితుడి కష్టాన్ని గుర్తించిన గల్ఫ్ జనసేన ఎగ్జిక్యూటివ్ మెంబర్ మనీష్, సభ్యులు దవరసింగి రాజా, బి. జగదీశ్‌లకు వివరాలు తెలిపారు.

**మూడు సార్లు కంపెనీకి వెళ్లి ఒప్పించిన జనసేన టీమ్:**

వెంటనే స్పందించిన రాజా, జగదీశ్ నేరుగా దుబాయ్‌లోని ఆ కంపెనీకి మూడు సార్లు వెళ్లారు. నారాయణను కలిసి ధైర్యం చెప్పి, కంపెనీ మేనేజ్‌మెంట్‌తో స్వయంగా చర్చలు జరిపారు. వారి నిరంతర ప్రయత్నాల ఫలితంగా యాజమాన్యం దిగిరావడంతో నారాయణను సురక్షితంగా స్వగ్రామానికి పంపించారు.

**ప్రవాసులకు అండగా జనసేన:**

గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలుగు కార్మికులకు గల్ఫ్ జనసేన అండగా నిలుస్తోందని, ఎవరైనా ఆపదలో ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని గల్ఫ్ జనసేన నాయకులు పిలుపునిచ్చారు. బాధితుడు నారాయణ, అతని కుటుంబ సభ్యులు గల్ఫ్ జనసేన టీమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# పాయకరావుపేటలో 19న మినీ మహానాడు

**- హోంమంత్రి అనిత సారథ్యంలో భారీ ఏర్పాట్లు**

**- 19న పాయకరావుపేట**

**మినీ మహానాడు: పల్లా లేదా రామ్మోహన్ రాక**




**నక్కపల్లి, మే 12, ( ప్రజా ప్రతిభ ) :**

పాయకరావుపేట నియోజకవర్గ స్థాయి టీడీపీ మినీ మహానాడు ఈనెల 19వ తేదీన హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మంగళవారం వెల్లడించారు.నక్కపల్లిలోని మంత్రి నివాసం వద్ద 19వ తేదీన ఉదయం 10 గంటలకు మినీ మహానాడు ప్రారంభం కానున్నదని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి టీడీపీ నాయకులు పెద్దఎత్తున హాజరుకానున్నారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు లేదా కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు హాజరయ్యే అవకాశం ఉందని వెంకటేష్ తెలిపారు.ప్రతి గ్రామం నుంచి 30 మంది కార్యకర్తలునియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం నుంచి గ్రామ కమిటీ సభ్యులతో పాటు కనీసం 30 మంది చొప్పున కార్యకర్తలు తరలిరావాలని కొప్పిశెట్టి వెంకటేష్ పిలుపునిచ్చారు. మినీ మహానాడు వేదికగా వివిధ గ్రామాల నుంచి పలువురు టీడీపీలో చేరే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు.ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రతి గ్రామంలోనూ ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు నాయకులు సమన్వయంతో పనిచేసి మినీ మహానాడును విజయవంతం చేయాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు మరింత కష్టపడి పనిచేయాలని కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, మాజీ వైస్ ఎంపీపీ వైభవన రమణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరెడ్డి చిట్టిబాబు, పాయకరావుపేట మండలం అధ్యక్షుడు చింతలపు ప్రదీప్, దార్ల కృష్ణ, కురం దాస్ నూకరాజు, యాళ్ల వరహాలు బాబు, తో పాటు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రూ.30లక్షలతో కో-ఆపరేటివ్ భవనం శంకుస్థాపన





**మాడుగుల,మే 12 ప్రజా ప్రతిభ:**

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు ఉండూరు. దేముడు ఆధ్వర్యంలో కింతలి పల్లాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన రూ.30లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న కో-ఆపరేటివ్ భవనానికి శంకుస్థాపన చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా కోపరేటివ్ భవనం లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బండారు సత్యనారాయణమూర్తి రూ.30 లక్షలతో భవనం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఉండూరు దేవుడు అన్నారు. అనంతరం రూ.20 లక్షలతో సిసి రోడ్లు ప్రారంభించారు. కాశీ పురం గ్రామంలో రూ.10 లక్షలతో రామాలయానికి భూమి పూజ అనంతరం రూ.20 లక్షలతో సిస్ రోడ్లు ప్రారంభించారు. అవురువాడ వీరనారాయణం గ్రామంలో కాగిత, తుమ్మవానిపాలెం గ్రామాలలో రూ.20 లక్షలతో మూడు సిమెంట్ రోడ్లు ప్రారంభించారు. అనంతరం ఎల్. పొన్నవోలు గ్రామంలో రూ.15 లక్షలతో రామాలయం భూమి పూజ అనంతరం రూ.35 లక్షలతో సిసి రోడ్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్పుప్పాల అప్పలరాజు, పెద్దేరు రిజర్వాయర్ చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, ఎంపీపీ రాజారాం, మండల కార్యదర్శి పుప్పాల రమేష్, క్లస్టర్ ఇన్చార్జ్ భీశెట్టి విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ, డిసిసిబి సీఈవో డివిఎస్.వర్మ, జనసేన మండల అధ్యక్షులు గ్రెట్టెడ్డి శివాజీ, జనసేన ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుతరావు, మైచర్ల అర్జున గణపతిరావు, పిఎసిఎస్ అధ్యక్షులు, పిల్లా నాయుడు. కే.త్రినాథ్, శరగడం ఆదిబాబు, పదాల చాణక్య, తలారి రమేష్, నాయన సత్యనారాయణ, మైచర్ల సన్యాసిరావు, కోన భీమేశ్వరరావు, మజ్జి బాజ్జీ, కిమిశెట్టి గణేష్, నమ్మి అర్జున, మాజీ ఎంపిటిసి సిహెచ్. కళ్యాణ్ చక్రవర్తి, అప్పాన భాస్కరరావు, సీఈఓ పి.రమేష్, యండపల్లి సంతోష్ పాటు పలువురు కోపరేటివ్ సీఈఓలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై వ్యవసాయంత్రాలు

**- లాటరీ పద్ధతి పై ఎంపిక విధానం.**

**మే 19 వరకు ఆన్లైన్లో నమోదు ప్రక్రియ**



**అనకాపల్లి మే 12 ప్రజా ప్రతిభ:**

ఎలమంచిలి సబ్ డివిజన్ కు 36 లక్షలు విలువైన వ్యవసాయ పరికర యంత్రాలు: ఎలమంచిలి ఏడి సమంత అనకాపల్లి జిల్లా బ్యూరో ప్రజా ప్రతిభ మే 12: ఎలమంచిలి సబ్ డివిజన్ పరిధిలో 36 లక్షల విలువైన వ్యవసాయ యాంత్రిక పరికరాలు రాయితీపై ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని చిన్న సన్నకారు ఎస్సీ ఎస్టీ రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎలమంచిలి వ్యవసాయ సహాయ సంచాలకులు సమంత కోరారు. ఎలమంచిలి,అచ్యుతాపురం, రాంబిల్లి ఎస్ . రాయవరం మండలాలకు సంబంధించిన రైతులలో ఎస్సీ ఎస్టీ చిన్న సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీ పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు ట్రాక్టర్లు పవర్ టెల్లర్స్, పవర్ వీడర్స్ ,ట్రాక్టర్ పనిముట్లు ,స్ప్రేయర్లు, కోత యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావలసిన అభ్యుదయ రైతులు ఆన్లైన్ విధానంలో వ్యవసాయ అధికారుల ద్వారా ప్రతి రైతు సేవా కేంద్రంలో ఈ నెల 19 వరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు .అనంతరం లాటరీ విధానంలో పరికరాల యొక్క రైతులను ఎంపిక చేయడం జరుగుతుందని అందుకు కావలసిన రైతులు ముందుగా ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకం ఉండడం తోపాటు పంట నమోదు కలిగి ఉండాలని తెలిపారు. లాటరీ పద్ధతిలో ఎంపికైన రైతులకు మే 26 నుండి రైతు వాటర్ చెల్లింపులకు అవకాశం ఉంటుందని వ్యవసాయ సహాయ సంచాలకులు సమంత తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అమృత్ 2.0 పథకం ద్వారా 7.82 కోట్లతో మంచినీటి సరఫరా

**- బలహీన వర్గాల గృహ సముదాయాలకు సమగ్ర మంచినీటి సరఫరా**

**- వారం రోజులలో పనులు ప్రారంభానికి ఆదేశాలు**

**- మున్సిపల్ సంబంధిత ముఖ్య అధికారులతో ఎమ్మెల్యే సుందరపు సమీక్ష సమావేశం**



**అనకాపల్లి జిల్లా బ్యూరో ( జర్నలిస్ట్ నాగేశ్వరావు) ప్రజా ప్రతిభ మే 12:**

ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని బలహీనవర్గాల గృహసముదాయాలకు అమృత్ 2.0 పథకం ద్వారా 7.8 కోట్ల రూపాయలతో మంచినీటి సదుపాయం కల్పించేందుకు వారం లోగా పనులు ప్రారంభించాలని జలమందులు నియోజకవర్గ ఎమ్మెల్యే సుందర్పు విజయకుమార్ సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎలమంచిలి మున్సిపల్ కమిషనర్ బిజెఎస్ ప్రసాద్ రాజు తో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ (ఏఐఐబి) నిధుల నుండి 120.18 కోట్లతో ప్రారంభించిన ప్రాజెక్టు పనులలో భాగంగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కాగా సంబంధిత కాంట్రాక్టర్ అయిన మోస్సర్స్ ఎన్ ఎస్ సి (విశాఖపట్నం) కి వారంలోపు పనులు త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దక్షిణామూర్తి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రమీల ఎలమంచిలి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు అప్పారావు తదితరులు పాల్గొన్నారు

# భక్తిశ్రద్ధలతో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**నాతవరం, మే,12,(ప్రజా ప్రతిభ)**

మండల కేంద్రం నాతవరంలో భక్తిశ్రద్ధలతో శ్రీశ్రీశ్రీ అభయ ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు ఈ జయంతి సందర్భంగా ఆలయ ధర్మకర్త పైల పోతురాజు స్వామివారికి వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి స్వామివారికి మొక్కులు చెల్లించి నారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు ఈ జయంతి సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రజల సహాయ సహకారాలతో ఏర్పాటు చేశారు భక్తులకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు ఆలయ ధర్మకర్త ఏర్పాటు చేశారు

# నక్కపల్లి మండలంలో వాడవాడలా వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

**- పలు గ్రామాల్లో భజనలు, ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ**

**ఆలయ కమిటీల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు, భక్తుల రద్దీ**





**నక్కపల్లి, మే 12, (ప్రజా ప్రతిభ) :**

నక్కపల్లి మండల వ్యాప్తంగా మంగళవారం ఆంజనేయస్వామి జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా జరిగాయి. నక్కపల్లి, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు సహా పలు గ్రామాల్లో కొలువైన ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**భజన బృందాలతో మార్మోగిన ఆలయాలు**

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భజన బృందాలు భక్తి గీతాలతో ఆలయ పరిసరాలను హోరెత్తించాయి. మహిళా భక్తులు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొని హనుమాన్ సంకీర్తనలు ఆలపించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు.

**ప్రత్యేక పూజలు, అభిషేకాలు**

అన్ని ఆలయాల్లోనూ తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, తమలపాకుల పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు.

**భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ**

దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ, గ్రామ పెద్దలు, భక్తులు, యువత, సహాయ సహకారాలతో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నప్రసాద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పలు చోట్ల ఉచిత ప్రసాదాలు, పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

**ప్రముఖుల హాజరు**

హనుమాన్ జయంతి వేడుకల్లో పలు పార్టీల ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభయ ఆంజనేయస్వామి అనుగ్రహంతో మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. స్వామివారి ఆశీస్సులతో రైతులు, ప్రజలందరికీ మేలు జరగాలని కోరుకున్నారు.

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, భక్తిభావంతో ముగిశాయి.

# మాధవనగరం పురవీధుల్లో స్వచ్ఛరథం



**నాతవరం, మే,12,(ప్రజా ప్రతిభ)**

మాధవనగరం గ్రామంలో మంగళవారం గ్రామ పురవీధుల్లో చెత్త సంపద కేంద్రాలకు తడి చెత్త పొడి చెత్త సేకరించి ప్రజలు ప్లాస్టిక్ వస్తువులను తీసుకొని వచ్చి వాటికి తగ్గట్టుగా షాంపూలు, సర్ఫ్ పాకెట్లు సబ్బులు వివిధ రకాల గృహోపకరణ వస్తువులను ప్రజలకు ఉపయోగపడే విధంగా తీసుకుంటున్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శివలంక మర్డేశ్వరరావు, తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కసింకోట గోవిందు, జనసేన కార్యకర్త గుడివాడ కృష్ణ ప్రజల్లో పాల్గొన్నారు

# శత శాతం ఫలితాలే లక్ష్యం

## - కలెక్టర్ విజయ క్రిష్ణన్





**అనకాపల్లి జిల్లా బ్యూరో ప్రజా ప్రతిభ (జర్నలిస్ట్ నాగేశ్వరరావు) మే 12:**
పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో శత శాతం ఫలితాతే లక్ష్యమని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ విద్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరములో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలోని అన్ని మండల విద్యా అధికారులతో 10వ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మండలానికి సంబంధించిన పాస్ శాతం మరియు ఫెయిల్ శాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫలితాల్లో వెనుకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే, ఫెయిల్ అయిన విద్యార్థి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. తల్లిదండ్రులతో కూడా సమన్వయం చేసుకుని విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రత్యేకంగా సప్లమెంటరీ పరీక్షల్లో సతశాతం పాస్ సాధించాలి అని కలెక్టర్ స్పష్టం చేశారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు వెంటనే చేపట్టాలని ఎం ఈ ఓ లకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నక్కపల్లి ప్రభుత్వాసుపత్రి

# అభివృద్ధికి కీలక నిర్ణయాలు

## - ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు

## - సీఎస్ఆర్ నిధులతో జనరేటర్, వెయిటింగ్ హాల్ ఏర్పాటుకు నిర్ణయం




**నక్కపల్లి, మే 12, (ప్రజా ప్రతిభ) :**
నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అభివృద్ధి కమిటీ సభ్యుడు కొప్పిశెట్టి వెంకటేష్, మండల ఎంపీడీవో కె. చలపతిరావు, నక్కపల్లి పంచాయతీ కార్యదర్శి, అమలాపురం మాజీ సర్పంచ్ పెదపూడి శంకర్రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**ప్రధాన తీర్మానాలు ఇవే:**
ఆసుపత్రి పరిసరాల్లో పచ్చదనం పెంపునకు గార్డెనింగ్ అభివృద్ధిపేద రోగులకు అవసరమైన వైద్య పరికరాలను గుర్తించి సమకూర్చడంసీఎస్ఆర్ నిధులతో కొత్త జనరేటర్ ఏర్పాటుఆసుపత్రి క్యాంటీన్ మరమ్మతులు, రోగులకు నాణ్యమైన భోజన సదుపాయంరోగులతో వచ్చే అటెండర్లకు సీఎస్ఆర్ నిధులతో వెయిటింగ్ హాల్ నిర్మాణంప్రసవమైన మహిళలకు వేడి మంచినీటి సదుపాయం కల్పన కు తీర్మానించడం జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ సభ్యుడు కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించామన్నారు. సీఎస్ఆర్ నిధులను సద్వినియోగం చేసుకుని జనరేటర్, అటెండర్లకు వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఆయన వెల్లడించారు.

# శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో

# ఘనంగా హనుమాన్ జయంతి

**వెంకటగిరి, మే 12(ప్రజా ప్రతిభ ):**



వెంకటగిరి పట్టణం బంగారు పేటలోని శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భముగా ఉదయం స్వామి వారికీ సుప్రభాతం, తదుపరి స్వామివారికి సకల అభిషేకములు,1008 తమలపాకులచే సహస్రార్చన 108 తులసి దళములచే అర్చన, వడమాల కార్యక్రమం అత్యంత వైభవముగా జరిగినది. ఈ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించడం జరిగింది.

# గంజాయి ముఠా... గుట్టు రట్టు

## - పోలీస్ తనిఖీలలో 97 లక్షల విలువైన గాంజా పట్టివేత

## - పోలీసు అదుపులో ముగ్గురు నిందితులు : అనకాపల్లి జిల్లా ఎస్పీ తూహీన్ సిన్హా













**అనకాపల్లి జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ నాగేశ్వరరావు) ప్రజా ప్రతిభ మే 12**
: అనకాపల్లి జిల్లాలోని భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది. సుమారు 97 లక్షల రూపాయల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురు నిందితులను అదుపులో తీసుకున్నట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని అనకాపల్లి బంగారు మెట్ట రోడ్డులోని కొండవానిపాలెం జంక్షన్ వద్ద ఈగల్ టీం స్పెషల్ బ్రాంచ్ బుచ్చయ్యపేట పోలీసులు సంయుక్తంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో జరిగిన తనిఖీలలో అనకాపల్లి వైపు వేగంగా వస్తున్న స్కూటీ మారుతి కారును తనిఖీ చేపట్టిగా ముగ్గురు నిందితులను అదుపులో తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రధాన నిందితుడు చీడికాడ మండలం బయలు పూడి గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు గుమ్మాల పేరు నాయుడు పట్టుబడగా ఇతనిపై ఇప్పటికే ఆరు కేసులు ఉన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. మరో నిందితుడు వైఎస్ఆర్ జిల్లా పెదబయలు మండలం గజ్జేడు గ్రామానికి చెందిన మండపల్లి సత్తిబాబు (సాగుతారు) కాగా చీడికాడ మండలం బయలుపూడి గ్రామానికి చెందిన డ్రైవర్ గొల్లవెల్లి గణేష్ ను అదుపులో తీసుకున్నట్లు వెల్లడించారు. వారి వద్ద నుండి 194 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోగా 97 లక్షల విలువ ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో గంజాయి పై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారని ప్రశంసించారు. అంతేకాకుండా గంజాయి మత్తు పదార్థాల పట్ల కఠినమైన హీరో టోలరెన్స్ విధానాన్ని అనుసరిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. మాదిగ ద్రవ్యాల వాడకం లేదా అమ్మకాలకు సంబంధించిన సంఘటనైన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు అంతేకాకుండా 112 లేదా 1972 నంబర్లకు ఫోన్ చేయడం ద్వారా సమాచారం అందించవచ్చుని వారు గుర్తింపును అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ముఖ్యంగా ఈ ఏడాది ఇప్పటివరకు 46 కేసులు నమోదు చేసి మొత్తం 1177 కేజీల గంజాయి చీట్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుండి 7.14 లీటర్ల హ్యాష్ హాయ్ లను స్వాధీనం చేసుకున్నామన్నారు అంతే కాకుండా గంజాయి తరలింపు కంటే ఆయిల్ రవాణా సులభం అని భావించి అటువైపు మళ్ళీ ఇచ్చినట్లు గుర్తించినట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రాసిక్యూషన్ విభాగంలో సమన్వయం ద్వారా ఏడాది 13 కేసుల్లో 24 మందికి శిక్షలు పడ్డాయని ఇందులో 16 మందికి పది నుండి 15 ఏళ్లు జైలు శిక్ష పడడం ఎన్ డి పి ఎస్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ ద్వారా 1.25 కోట్ల రూపాయలు ఆస్తులు సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా భారీ మొత్తంలో గంజాయి పట్టివేత ఆపరేషన్ లో పాల్గొన్న అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పి ఎం శ్రావణి కొత్తకోట సిఐజి కోటేశ్వరరావు బుచ్చయ్యపేట ఎస్సై ఏ శ్రీనివాసరావు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించడంతోపాటు ప్రశంస పత్రాలను నగదు రివార్డులను అందజేశారు.

# జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల

# నివారణకు సమన్వయ సమావేశం నిర్వహించిన అధికారులు

**నెల్లూరు జిల్లా బ్యూరో మే 12 (ఆత్మకూరు)(ప్రజా ప్రతిభ):**
జిల్లాలో జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రయాణికుల భద్రతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ మరియు ఆత్మకూరు ఆర్డీవో బి పావని ఆధ్వర్యంలో ఈరోజు జాతీయ రహదారి 67 మరియు 565కు సంబంధించిన రోడ్డు భద్రత అంశాలపై విస్తృత సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మరియు గ్రామ జంక్షన్ల వద్ద జరుగుతున్న ప్రమాదాలను తగ్గించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో చర్చించిన

**ముఖ్యాంశాలు:**
జాతీయ రహదారులపై ఆకస్మికంగా రోడ్లు దాటే పశువుల వల్ల ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, పశువుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. గ్రామ జంక్షన్లు, యూ-టర్న్లు మరియు ప్రమాదకర ప్రాంతాల్లో సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ రోడ్ సైన్స్ మరియు స్పీడ్ లిమిట్ సూచికలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హైవే పరిధిలో రాత్రి వేళల్లో మొబైల్ పెట్రోలింగ్‌ను మరింత పెంచి, వేగ నియంత్రణ మరియు అనుమానాస్పద వాహనాల తనిఖీలను చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు వేగంగా అందేలా పోలీస్, ఫైర్, అంబులెన్స్ మరియు ఇతర శాఖల మధ్య సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్ణయించారు. అడవి ప్రాంతాలకు సమీపంగా ఉన్న రహదారుల వద్ద వన్యప్రాణులు మరియు పశువుల కదలికలపై ఫారెస్ట్ శాఖ ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులకు



సూచించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఆర్ డి ఓ బి. పావని , ఆత్మకూరు డి ఎస్ పి వేణు గోపాల్,సి ఐ గంగాధర్ ,ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శేఖర్ , ఫైర్ ఆఫీసర్ రాజేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్లు ప్రభాకర్ , శ్రీనివాస్ రెడ్డి , ఆత్మకూరు మండల తహసీల్దార్ పద్మావతి, మర్రిపాడు మండల తహసీల్దార్ అనిల్ కుమార్, అనంతసాగర్ మండల తహసీల్దార్ వసంతరావు, వీర వసంత రావు, ఆత్మకూరు ఎస్ ఐ జిలాని, మర్రిపాడు ఎస్ ఐ,నేషనల్ హైవే మేనేజర్లు రవి తేజ, బ్రహ్మానంద రెడ్డి, ఇతర శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మార్పు ఆధ్వర్యంలో 325వ రోజు మొక్కలు నాటే కార్యక్రమం

**వెంకటగిరి, మే 12(ప్రజా ప్రతిభ ):**
ప్రముఖ సామాజిక కార్యకర్త, మార్పుసంస్థ వ్యవస్థాపకులు చిగురుపాటి పవన్ తన జీవితకాలం మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మంగళవారం 325వ రోజు సందర్భంగా అల్లూరు సీతారామరాజు జిల్లా అరకు ఎండపల్లి వలస ప్రాంతంలోని యం. పి. పి. యస్ పాఠశాల నందు స్థానికులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు . ఈ కార్యక్రమంలో అరకు ప్రాంతానికి చెందిన సామాజిక సేవకురాలు సీత , స్థానిక చైల్డ్ హోమ్ నిర్వాహకులు జలంధర్ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పవన్ అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారని, పర్యావరణ పరిరక్షణపై వారు చూపుతున్న శ్రద్ధ భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. అరకు వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో మాతో కలిసి వారు పనిచేయడం మాకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. రాబోవు రోజుల్లో ఆయన మా ప్రాంతంలో అనేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. మార్పుసంస్థ వ్యవస్థాపకులు చిగురుపాటి పవన్ మాట్లాడుతూ అతి తక్కువ కాలంలో అరకులో ఎక్కువమంది మిత్రులు నాకు సహకరించి నాతో కలిసి పనిచేయడం సంతోషకరమని, అరకు లోని ప్రతి పాఠశాలలో , ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృతంగా మొక్కలు నాటుతామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి అరకు లోని సామాజిక కార్యకర్తలతో కలిసి పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్నా ప్రతిఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో పవన్ తో పాటు సీత, జలంధర్, కిశోర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# 34 వేల ఎకరాలుకు రబీ సాగునీరు

తాగునీరు విడుదల చేసిన ఎమ్మెల్యే కురుగొండ్ల..





**వెంకటగిరి, మే 12(ప్రజా ప్రతిభ ):**
బాలాయపల్లి మరలం ఊట్లపల్లి వద్ద తెలుగుగంగ 5వ బ్రాంచి కాలువ ఆయకట్టు ద్వారా రబీ (రెండవ పంట) సాగుకు మరియు తాగునీటి అవసరాల నిమిత్తం వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ మంగళవారం లాంఛనంగా నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా కాలువ వద్ద వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు.ఈ సందర్భంగా కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, సుమారు 34,000 ఎకరాల ఆయకట్టుకు రబీ పంట కోసం సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కేవలం సాగునీరు మాత్రమే కాకుండా తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి, నాయుడుపేట తదితర ప్రాంతాలకు తాగునీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటూ, అవసరమైన ప్రతి ప్రాంతానికి ప్రణాళికాబద్ధంగా నీరు అందేలా వాటర్ మేనేజ్‌మెంట్ చేస్తున్నామని అధికారులకు మరియు రైతులకు సూచించారు.తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, స్వర్గీయ నందమూరి తారక రామారావు దార్శనికతతో, చెన్నైకి తాగునీరు అందించే ఉద్దేశ్యంతో ప్రారంభమైన బృహత్తర ప్రాజెక్టు "తెలుగుగంగ" అని ఆయన కొనియాడారు.ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా చివరి ఆయకట్టు భూములకు కూడా నీరు అందేలా అధికారులను ఆదేశించామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుగంగా ప్రాజెక్టు అధికారులు, ఎఏ. యం. సి చైర్మన్ మురుగ , మండల అధ్యక్షులు, పి. ఏ. సి. యస్ చైర్మన్లు, మండల నాయకులు, నీటి సంఘ సోసైటీ అధ్యక్షులు, ఊట్లపల్లి గ్రామ నాయకులు, రైతులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు జిల్లా బ్యూరో మే 12(కోవూరు) (ప్రజా ప్రతిభ)**
కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఎన్విరాన్మెంటల్ బోర్డు చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డిలతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు అందరకీ స్వామివారి ఆశీసులు ఎల్లపుడు ఉండాలని కోరుకున్నారు.మొక్కు తీర్చుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఘనవిజయం సాధించాలని కోరుకుంటూ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి మొక్కుకున్న '1001 టెంకాయల' మొక్కును ఈ సందర్భంగా తీర్చుకున్నారు అందులో భాగంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా టెంకాయలు కొట్టి, స్వామివారికి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పోబ్బారెడ్డి మల్లికార్జున్రెడ్డి, గాదిరాజు అశోక్, తాటిపర్తి విజయ్ కుమార్ రెడ్డి, బెల్లంకొండ గోవిందు, సాయి జయంత్, దండూరి సుజిత్, నాటకరాని వెంకట్ హనుమాన్ భక్తులు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## గూడూరులో వైభవంగా
# హనుమాన్ జయంతి వేడుకలు

- పలు ఆలయాల్లో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రత్యేక పూజలు





**నెల్లూరు జిల్లా బ్యూరో మే 12(గూడూరు)(ప్రజా ప్రతిభ):**
నెల్లూరు జిల్లా ?గూడూరు పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణ సమీపంలోని ఇందిరమ్మ కాలనీ సునీల్ కుమార్ నగర్‌లో వెలసిన శ్రీ కార్యాసిద్ధి ఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారికి విశేష అలంకరణ, అభిషేకం, హోమం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను నిర్వాహకులు వాటంబేడు శివకుమార్, వాటంబేడు హరికుమార్ తదితరులు పర్యవేక్షించారు. అదేవిధంగా, విఘ్నేశ్వరపురం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే స్వయంగా అభిషేకం నిర్వహించగా, పురిటిపాలెం సమీపంలోని ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించగా, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## అంగరంగ వైభవంగా
# హనుమాన్ శోభయాత్ర...

- పట్టణ పురవీధులలో బైక్ ర్యాలీ..
- జై శ్రీరామ్ నామస్మరణతో మారు మ్రోగిన శోభయాత్ర..





**వెంకటగిరి, మే 12(ప్రజా ప్రతిభ ):**
హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా విశ్వహిందూ పరిషత్ –వెంకటగిరి వారి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వెంకటగిరి పట్టణం విశ్వో దయ కళాశాల క్రీడా ప్రాంగణం నుండి బయలుదేరిన హనుమాన్ శోభ యాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. అలాగే పట్టణ పురవిధుల్లో బైక్ ర్యాలీ జరిగింది. భారీ సంఖ్యలో ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు హిందు బంధువులు, శ్రీరామ భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. కోలాట నృత్యములు , బాణాసంచా, డి. జె పాటలతో జై శ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణతో శోభాయాత్ర విజయవంతంగా కనుల పండుగగా జరిగింది.

## అక్రమ సంబంధాలకు అడ్డుగా ఉందని అత్తను చంపేసిన కోడలు,సహకారం అందించిన తల్లి





**నెల్లూరు జిల్లా బ్యూరో మే 12(దగదర్తి) (ప్రజా ప్రతిభ):**
నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం దగదర్తి మండలం సున్నపు బట్టి గ్రామం లో దారుణ ఘటన చోటుచేసుకుంది, అక్రమ సంబందాలు తో చెడు మార్గంలో నడుస్తున్న కోడలిని మందలించి సరైన్ మార్గం లో నడవాలని చెప్పిందన్న కారణంగా తన అక్రమ సంబంధాలకు అడ్డుగా ఉందని భావించి అత్త మైపాటి మాధవిఏపద్మ ను గొంతు నిలిమి అత్యంత దారుణంగా హతమార్చిన కోడలు పద్మశ్రీ, ఈ హత్యలో కూతురికి సహకారం అందించిన నిందితురాలి తల్లి పుచ్చలపల్లి మాధవి.దగదర్తి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసుకు సంబంధించిన పూర్తి వివరాలును వెల్లడించిన కావలి డి ఎస్ పి రమణకుమార్, డి ఎస్ పి మాట్లాడుతూ మైపాటి మాధవి అనే మహిళ తన కుమారుడికి సొంత అన్న కుమార్తె పద్మశ్రీ ని ఇచ్చి ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు, పద్మశ్రీ భర్త నెల్లూరు లో ఎలక్ట్రీషియన్ గా పనిచేస్తుండగా పద్మశ్రీ తల్లి బండి పై టిఫిన్ షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారని పద్మశ్రీ అదే గ్రామానికి చెందిన వేరొక వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుందని తెలిసి అత్త మాధవి పద్మశ్రీ ని పలు మార్లు పద్ధతి మార్చుకోవాలని చెప్పడం,పెద్దల వద్ద పంచాయితీ పెట్టడం తో అత్త పై కక్ష పెంచుకుని తన అక్రమ సంబంధాలకు అడ్డుగా వున్న అత్తని ఎలాగైనా అడ్డుతొలగించుకోవాలని తన అమ్మ పుచ్చలపల్లి మాధవి తో కలిసి పద్మశ్రీ నిద్రిస్తున్న అత్త మైపాటి మాధవి గొంతునులిమి,దిండుతో ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసినట్టు తెల్లవారి మాధవి వంటిపై గాయాలు గుర్తించిన బంధువులు పిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేయగా నిందితులు భయంతో పారిపోయినట్టు పోలీసులు వారిని అరెస్ట్ చేసి కోర్టు లో హాజరు పరిచినట్టు డి ఎస్ పి రమణకుమార్ తెలియచేశారు.

## 50 మంది పేదలకు ఇంటి
# పొజిషన్ సర్టిఫికెట్ లు పంపిణీ

- అందజేసిన గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్






**నెల్లూరు జిల్లా బ్యూరో మే 12(గూడూరు)(ప్రజా ప్రతిభ):**
రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి మరియు నెల్లూరు జిల్లా ?గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ గూడూరు పట్టణంలో స్థానిక తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంగళవారం 50 మంది లబ్ధిదారులకు ఇంటి పొజిషన్ సర్టిఫికెట్లను అందజేశారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే నిరుపేదల కలను నెరవేరుస్తున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కేవలం అర్హత ఉన్న వారికే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, చంద్రబాబునాయుడు ప్రభుత్వం పని చేసే ప్రభుత్వమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి నాణ్యమైన పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిల్లు చెంచురామయ్య , పులిమి శ్రీనివాసులు , రావూరు సురేంద్ర , ఏసుపాక పెంచలయ్య , పిట్టి నాగరాజు , వెంకటేశ్వర్లురెడ్డి , వెంకటేశ్వర్లురాజు ఇంకా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

**శాంతిపురం,మే 12 (ప్రజా ప్రతిభ):**



మండలంలోని పలు దేవాలయాలలో హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించారు.ఇందులో భాగంగా రాళ్ళబూదుగూరు లోని అంపయ్యతోపు హనుమాన్ నగర్ లోని వీరాంజనేయ స్వామి దేవాలయంలో 27 అడుగుల భారీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి,గర్భగుడిలోని స్వామి వారికి పంచామృతభిషేకాలను నిర్వహించి ప్రత్యేక చందన ఆకు పూజ వడమాలతో ప్రత్యేక అలంకరణ తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు స్వామివారి ఆశీర్వాదాలు అందచేశారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం చేశారు.హనుమ జయంతి సందర్భంగా దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రజా ప్రతిభ
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts
Praja Pratibha News
బుధవారం
13 మే 2026

## పెంచలకోనలో ఘనంగా

# హనుమాన్ జయంతి వేడుకలు...





వెంకటగిరి, మే 12(ప్రజా ప్రతిభ ):

నెల్లూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోన క్షేత్రం నందు క్షేత్ర పాలకుడు సుందరి వీరాంజనేయ స్వామి వారికి హనుమజ్జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం ఆంజనేయ స్వామి మూలమూర్తి కి పంచామృతాలతో అభిషేకం, చందనాలంకారం, ప్రత్యేక పుష్పాలంకరణ,ఆకు పూజలు , సాయంత్రం తిరుచ్చి పల్లకి క్షేత్రోత్సవం వైభవంగా అర్చకులు,వేద పండితుల మంత్రోచ్ఛరణలతో నాద స్వర వాయిద్యముల తో వైభవంగా పెంచలకోన మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు డిప్యూటీ కమీషనర్, కార్యనిర్వహణాధికారికోవూరు.జనార్ధన్ రెడ్డి పర్యవేక్షణలో జరిగింది.

ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలుగా రాంకూరు గ్రామానికి చెందిన పిన్ను.సుబ్బ రామిరెడ్డి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బేటి బచావో, బేటి పడావో

# బాల్యవివాహాల నిర్మూలన అవగాహన



చిట్టమూరు మే 12 ప్రజా ప్రతిభ

తిరుపతి జిల్లా చిట్టమూరు.. కోట ప్రాజెక్టు,చిట్టమూరు మండలం,మల్లం పంచాయతీ, రంగనాథపురం అంగనవాడి కేంద్రం నందు సిడిపిఓ ఆదేశాల మేరకు మల్లం సెక్టర్ సూపర్వైజర్ కవిత, కిషోర్ బాలికల అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఫేస్బుక్ మరియు ఇంస్టాగ్రామ్ వాటిపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేసుకోవాలని, 18 సంవత్సరాల లోపు వివాహం జరిగినట్లయితే చట్టపరంగా కేసు నమోదు చేయడం జరుగుతుంది. 18 సంవత్సరాల నిండిన వాళ్లకు పెళ్లి జరిగినట్లయితే భవిష్యత్తులో సంతోషంగా ఉంటారు. జీవితం సంతోషంగా ఆనందంగా సాగుతుంది అని సూచించారు. ఈ కార్యక్రమంలో పిల్లల, తల్లులు, కిషోర్ బాలికలు, అంగనవాడి టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీరాంజనేయ స్వామికి

# విశేష చందన అలంకరణ...




వెంకటగిరి, మే 12(ప్రజా ప్రతిభ ):

వెంకటగిరి పట్టణంలోని పాతకోట లో వెలసియున శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికీ ఉదయం ప్రత్యేక అభిషేకములు, ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. అలాగే సాయంత్రం విశేషా చందనాలంకరం జరిగింది.ఈ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.

## పదవ తరగతి అత్యుత్తమ ప్రతిభను సాధించిన

# షేక్ మహమ్మద్ ఇర్ఫాన్‌కు సన్మాన కార్యక్రమం

చిట్టమూరు మే 12 ప్రజా ప్రతిభ

తిరుపతి జిల్లా చిట్టమూరు..సామాన్య రైతు కుటుంబంలో పుట్టి పట్టుదల,క్రమశిక్షణతో సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ తిరుపతి జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు.చిట్టమూరు మండలం తాడిమేడుకు చెందిన షేక్ షాజహాన్ కుమారుడు షేక్ మహమ్మద్ ఇర్ఫాన్. 2025-26 వ సంవత్సరం పదవ తరగతిలో 583 మార్కులు సాధించి మెరిసిన ఆణిముత్యమై నిలిచాడు. బీసీ హాస్టల్ లో విద్యను అభ్యసించి అత్యుత్తమ ప్రతిభతో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ,చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మహమ్మద్ ఇర్ఫాన్ ను మంత్రి శాలువాతో సన్మానించి,మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి అందించే పదివేల రూపాయలు నగదు బహుమతిని అందజేశారు.ఈనెల 5వ తేదీ జిల్లా స్థాయిలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా సన్మానాన్ని అందుకున్న మహమ్మద్ ఇర్ఫాన్ మంగళవారం మంత్రి సవిత చేతుల మీదుగా మెమెంటో,నగదు బహుమతి అందుకోవడంపై పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.మంచి మార్కులతో గ్రామానికి,తల్లిదండ్రులకు పేరు తీసుకువచ్చాడని వార్డెన్, ఉపాధ్యాయులు,స్థానికులు బాబు, పలువురు ఇర్ఫాన్ ను అభినందించారు.



## అభయ ఆంజనేయ స్వామి

## జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు



పెద్దపంజాణి మే 12(ప్రజాప్రతిభ).

పెద్దపంజాణి మండలంలోని రాయలపేట గ్రామంలో వెలసిన అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో అభయ ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామివారి దర్శనం తీసుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త అన్నదాన కార్యక్రమాలు, భజనలు, ఆధ్యాత్మిక సభలను ఏర్పాటు చేశాయి. "శ్రీ రామ దూత" అయిన ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ధైర్యసాహసాలు కలగాలని పూజారులు ఆకాంక్షించారు.భక్తులు "జై శ్రీరామ్ – జై హనుమాన్" నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. ప్రత్యేక అలంకరణలతో తీర్చిదిద్దిన స్వామివారి విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది.

## శ్రీ అభయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

### - భక్తులకు అన్నదాన కార్యక్రమం...



వెంకటగిరి, మే 12(ప్రజా ప్రతిభ ):

వెంకటగిరి మండలం పెట్లూరు గ్రామం,నాయుడు పేట మెయిన్ రోడ్డులో వెలసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారికీ మంగళవారం హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా వెంకటగిరికి చెందిన వాసు రియల్ ఎస్టేట్ అధినేత తమటం హనుమంత రావు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో స్వామి వారికీ ఉదయం ప్రత్యేక అభిషేకములు, ప్రత్యేక పూజలు,విశేష అలంకరణ జరిగాయి. అనంతరం మధ్యాహ్నం అన్నదానకార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదములు స్వీకరించడం జరిగింది.

## అసోం సీఎం ప్రమాణ స్వీకారానికి

# హాజరైన చంద్రబాబు, లోకేష్



అమరావతి మే 12(ప్రజాప్రతిభ).

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అసోంలో పర్యటించారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వారిద్దరూ హాజరయ్యారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశంలోని పలువురు ఎన్డీఏ నేతలు తరలివచ్చారు.ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో చంద్రబాబు, లోకేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు కేంద్ర మంత్రులతో వారు సరదాగా ముచ్చటించారు. ఈ కార్యక్రమం ఎన్డీఏ కూటమి నేతల మధ్య స్నేహపూర్వక భేటీకి వేదికగా మారింది.వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ముఖ్య నేతలతో చంద్రబాబు, లోకేష్ ఆత్మీయంగా సంభాషిస్తూ కనిపించారు. ఈ పర్యటన ద్వారా జాతీయ స్థాయిలో కూటమి నేతలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకున్నట్లయింది.

## 15న పుట్టపర్తి నుంచి ఏం

# టేకాఫ్ అవుతుందో ఊహించగలరా?

### - నారా లోకేష్ టీజర్ ట్వీట్

అమరావతి మే 12(ప్రజాప్రతిభ).

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. "మే 15న పుట్టపర్తి నుంచి ఏం టేకాఫ్ అవుతుందో ఊహించగలరా?" అంటూ ఆయన మంగళవారం ట్వీట్ చేశారు. దీనికి జతగా, ఓ అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం ఆకాశంలోకి దూసుకెళ్తున్న ఏఐ (ఏఐ) వీడియోను కూడా పంచుకున్నారు. ఈ పోస్ట్ ద్వారా పుట్టపర్తిలో రాబోతున్న భారీ ప్రాజెక్టుపై ఆయన అంచనాలను పెంచారు.శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రాంతంలో సుమారు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం ఈ నెల 15వ తేదీన జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు.ఈ మెగా ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అంచనా. రాష్ట్రంలో రక్షణ రంగ ఉత్పాదనను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. శంకుస్థాపన కార్యక్రమం సమీపిస్తున్నరుణంలో, మంత్రి నారా లోకేష్ చేసిన ఈ టీజర్ ట్వీట్ ప్రాజెక్టుపై సర్వత్రా ఆసక్తిని పెంచుతోంది.



## రెండో రోజూ కుప్పకూలిన మార్కెట్లు

**పశ్చిమాసియా ఉద్రిక్తతలు, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలతో అమ్మకాల ఒత్తిడి**

**1,456 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 436 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**ప్రధాని మోదీ వ్యాఖ్యలతో ఇన్వెస్టర్లలో పెరిగిన ఆందోళన**

**ఐటీ, రియల్టీ షేర్లలో భారీ అమ్మకాలు**



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. వరుసగా రెండో సెషన్‌లో కూడా అమ్మకాల సునామీ కొనసాగింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా అన్ని రంగాల షేర్లలోనూ తీవ్రమైన అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1,456.04 పాయింట్లు పతనమై 74,559.24 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 436.3 పాయింట్లు నష్టపోయి 23,379.55 వద్ద ముగిసింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో ఇంధన వినియోగం, విదేశీ ప్రయాణాలు, బంగారం కొనుగోళ్లు తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునివ్వడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మరింత బలహీనపరిచింది. ఈ వ్యాఖ్యలతో పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థపై విస్తృత ప్రభావం చూపుతుందనే భయాలు తీవ్రమయ్యాయి.

బ్రాడర్ మార్కెట్‌లో నష్టాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 2.54 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 3.17 శాతం మేర పతనమయ్యాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ, రియల్టీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, టైటాన్, టీసీఎస్ వంటి షేర్లు 4.44 శాతం వరకు నష్టపోయాయి. సెన్సెక్స్ 30 షేర్లలో ఎస్‌బీఐ మాత్రమే లాభాల్లో ముగియడం గమనార్హం.

సాంకేతిక విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి తక్షణ మద్దతు 23,300 వద్ద, ఆ తర్వాత 23,100 వద్ద ఉందని చెబుతున్నారు. ఎగువ స్థాయిలో 23,500 తక్షణ నిరోధకంగా మారింది. క్రూడ్ ఆయిల్ ధరలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్లలో ఒడిదుడుకులు కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, పటిష్ఠమైన దేశీయ ఆర్థిక మూలాలు మార్కెట్లకు మద్దతుగా నిలుస్తాయని వారు అభిప్రాయపడుతున్నారు.

## ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయిన గూగుల్ సెర్చ్..

**భారత్‌లోనూ యూజర్ల ఇబ్బందులు**

**భారత్, అమెరికా సహా పలు దేశాల్లో యూజర్ల ఇబ్బందులు**

**'500 ఇంటర్నల్ సర్వర్ ఎర్రర్' కారణంగా సమస్య**

**సమస్యను పరిష్కరిస్తున్నామన్న గూగుల్ ఇంజినీర్లు**



**న్యూఢిల్లీ:** టెక్ దిగ్గజం ఆల్ఫాబెట్ ఇంక్‌కు చెందిన గూగుల్ సెర్చ్ సేవలు మంగళవారం ఉదయం ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయాయి. భారత్, అమెరికా సహా పలు దేశాల్లోని వినియోగదారులు గూగుల్ సెర్చ్‌ను యాక్సెస్ చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలామందికి సెర్చ్ పేజీ ఓపెన్ కాలేదు.

సెర్చ్ చేయడానికి ప్రయత్నించిన అనేక మంది యూజర్లకు '500 ఇంటర్నల్ సర్వర్ ఎర్రర్' అనే సందేశం కనిపించింది. 'మీ అభ్యర్థనను ప్రాసెస్ చేస్తున్నప్పుడు అంతర్గత సర్వర్ లోపం తలెత్తింది. మా ఇంజినీర్లకు సమాచారం అందింది, వారు సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారు. దయచేసి మళ్లీ ప్రయత్నించండి' అని ఆ సందేశంలో ఉంది. సాధారణంగా ఈ ఎర్రర్, యూజర్ల డివైజ్‌లు లేదా ఇంటర్నెట్ కనెక్షన్‌లో కాకుండా, కంపెనీ సర్వర్ల వైపు సమస్య ఉన్నప్పుడు కనిపిస్తుంది.

ఈ అంతరాయంతో సోషల్ మీడియాలో, ఆన్‌లైన్ ఔటేజ్-ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్‌లలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కేవలం భారత్ నుంచే స్వల్ప వ్యవధిలో వందల సంఖ్యలో రిపోర్టులు నమోదయ్యాయి. ఈ సమస్య కారణంగా కొంతమంది యూజర్లు సెర్చ్ ఫలితాలను చూడలేకపోయారు.

ఇటీవలి కాలంలో పలు టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌లు అంతరాయాలకు గురవడం గమనార్హం. ఈ ఏడాది మార్చిలో చైనాకు చెందిన ఏఐ చాట్‌బాట్ డీప్‌సీక్ ఏడు గంటలకు పైగా ఆఫ్‌లైన్‌లో ఉండిపోయింది. అదే నెలలో, ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా డైరెక్ట్ మెసేజ్‌ల విషయంలో సమస్యలు ఎదుర్కొన్నారు. ఫిబ్రవరిలో యూట్యూబ్ సేవలు కూడా ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయిన విషయం తెలిసిందే.

## వీరందరికీ ఎల్పీజీ గ్యాస్ సబ్సిడీ కట్

**రూ. 10 లక్షల వార్షిక ఆదాయం దాటిన వారికి సబ్సిడీ కట్**

**పాన్ కార్డు డేటా ఆధారంగా ఐటీ రికార్డులను తనిఖీ చేస్తున్న వైనం**

**అనర్హులుగా తేలిన వారికి మెసేజ్ లు పంపిస్తున్న ఆయిల్ కంపెనీలు**



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ఎల్పీజీ గ్యాస్ సబ్సిడీ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. వార్షిక ఆదాయం రూ. 10 లక్షలు దాటిన కుటుంబాలకు సబ్సిడీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఇది 2015 నుంచి ఉన్న రూలే అయినప్పటికీ, ఇప్పటివరకు వినియోగదారుల వ్యక్తిగత డిక్లరేషన్‌పై ఆధారపడేవారు. కానీ ఇప్పుడు నేరుగా పాన్ కార్డ్ డేటా ఆధారంగా ఐటీ రికార్డులను తనిఖీ చేస్తున్నారు.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, కేవలం కనెక్షన్ ఉన్న వ్యక్తి ఆదాయమే కాదు.. భార్యాభర్తల్లో ఎవరి ఆదాయం రూ. 10 లక్షలు దాటినా ఆ కుటుంబం సబ్సిడీకి అనర్హమవుతుంది. ఇప్పటికే ఐటీ రికార్డుల ప్రకారం అనర్హులుగా తేలిన వారికి ఆయిల్ కంపెనీలు మెసేజ్‌లు పంపిస్తున్నాయి. 7 రోజుల్లోగా అభ్యంతరాలు తెలపకపోతే ఆటోమేటిక్‌గా సబ్సిడీ కట్ అయిపోతుంది.

ఈ నిబంధనల వల్ల సామాన్యులకు లేదా పేదలకు ఎలాంటి ఇబ్బంది లేదు. ముఖ్యంగా 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' లబ్ధిదారులకు ఈ రూల్ వర్తించదు. వారికి వచ్చే సబ్సిడీ యథావిధిగా అందుతుంది.

## మోదీ స్టేడియంలో సన్‌రైజర్స్

# ఘోరపరాజయం...

**86 పరుగులకే ఆలౌట్**

**సన్‌రైజర్స్‌పై 82 పరుగుల తేడాతో గుజరాత్ ఘన విజయం**

**169 పరుగుల లక్ష్య ఛేదనలో స్వల్ప స్కోరుకే కుప్పకూలిన హైదరాబాద్**

**రాణించిన గుజరాత్ బౌలర్లు.. రబడా, హోల్డర్‌లకు మూడేసి వికెట్లు**



**అహ్మదాబాద్:** అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను 82 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించింది. 169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్.. గుజరాత్ బౌలర్ల ధాటికి 14.5 ఓవర్లలో కేవలం 86 పరుగులకే కుప్పకూలింది.

ఛేదనలో సన్‌రైజర్స్ ఆది నుంచే వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ డకౌట్‌గా వెనుదిరగడంతో మొదలైన పతనం ఏ దశలోనూ ఆగలేదు. కగిసో రబడా (3/28), జాసన్ హోల్డర్ (3/20) నిప్పులు చెరిగే బంతులతో హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు తీయగా, సిరాజ్ ఒక వికెట్ పడగొట్టాడు. హైదరాబాద్ జట్టులో కెప్టెన్ పాట్ కమిన్స్ (19) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (44 బంతుల్లో 61), వాషింగ్టన్ సుందర్ (33 బంతుల్లో 50) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఆరంభంలో కెప్టెన్ గిల్ సహా కీలక వికెట్లు త్వరగా కోల్పోయినా, వీరిద్దరి భాగస్వామ్యాలు గుజరాత్‌ను ఆదుకున్నాయి. హైదరాబాద్ బౌలర్లలో ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ రెండేసి వికెట్లు తీశారు.

మొత్తంగా బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన గుజరాత్ ఈ సీజన్‌లో మరో కీలక విజయాన్ని నమోదు చేసుకుంది.

## మాజీ ఛాంపియన్‌కు వైల్డ్ కార్డ్..

**టాప్ సీడ్స్‌కు తిప్పలేనా..!**



**న్యూఢిల్లీ:** మట్టికోర్టు పోరాటాలకు నెలవైన ఫ్రెంచ్ ఓపెన్‌కు మరో ఆరు రోజులే ఉంది. ఇప్పటికే టాప్ సీడ్స్ జన్నిక్ సిన్నర్, జ్వెరెవ్, స్వియాటెక్‌లు తమవైన వ్యూహాలతో బిజీగా ఉండగా.. టోర్నీని మరింత ఆసక్తిగా మార్చేందుకు నిర్వాహకులు వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఖరారు చేశారు. మాజీ ఛాంపియన్ స్టాన్ వావ్రింకా, ఒకప్పటి సెమీస్ ఆడిన గేల్ మోన్‌ఫిల్స్‌కు ఆడే అవకాశమిచ్చింది. మహిళల విభాగంలో ఎనిమిది మంది వైల్డ్ కార్డ్ ఎంట్రీతో ఫ్రెంచ్ ఓపెన్ ఆడనున్నారు.

రొలాండ్ గరోస్ టోర్నమెంట్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ సాధించిన వెటరన్ వావ్రింకా ప్రస్తుతం 125వ ర్యాంక్. కానీ, ఈ ఈవెంట్లో అతడు గుర్తుండిపోయే ప్రదర్శనలు చేసిందుకు ఈసారి నిర్వాహకులు అవకాశమిచ్చారు. 2015లో క్వార్టర్స్‌లో రోజర్ ఫెదరర్‌ను ఓడించిన ఉత్సాహంతో.. ఫైనల్లో నొవాక్ జకోవిచ్‌ను చిత్తు చేసి టైటిల్ కొల్లగొట్టాడీ స్విట్జర్లాండ్ స్టార్. గేల్ విషయానికొస్తే.. ఈ ఫ్రెంచ్ ఆటగాడు 2008లో సెమీస్ వరకూ వెళ్లాడు. కానీ, ఫెదరర్ జోరుకు నిలవలేక చేతులెత్తేశాడు.

వావ్రింకా, గేల్‌తో పాటు పురుషుల విభాగంలో, మహిళల విభాగలో పలువురు వైల్డ్ కార్డ్ ఎంట్రీ దక్కించుకున్నారు. పురుషుల వైల్డ్ కార్డ్ జాబితాలో.. నిశేష్ బసవరెడ్డి, టిటౌన్ డ్రొగుట్, హుగో గస్టన్, అర్థర్ జీ, మోయిస్ కౌమె, ఆడమ్ వాల్టన్ ఉన్నారు. మహిళల విభాగంలో క్లారా బురెల్, సెనియా ఎఫ్రెమోవా, ఫియోనా ఫెర్రో, లియోలియా జీన్‌జీన్, ఎమెర్సన్ జోన్స్, సరాహ్ రకొటొమంగ, అలిసే తుబెల్లో, ఆకాశ ఉర్హోబోలు వైల్డ్ కార్డ్ ఎంట్రీ సాధించారు.

**టాప్ సీడ్స్‌గా**

పురుషుల సింగిల్స్‌లో జనిక్ సిన్నర్, అలెగ్జాండర్ జ్వెరెవ్, నొవాక్ జకోవిచ్, ఫెలిక్స్ అగర్ అలిస్సిమెలు టాప్ సీడ్స్‌గా పోటీ పడుతున్నారు. మహిళల విభాగంలో ఇగా స్వియాటెక్, ఎలెనా రిబాకీనాలు టైటిల్ లక్ష్యంగా ఆడనున్నారు. మే 18 నుంచి జూన్ 7 వరకూ ఫ్రెంచ్ ఓపెన్ జరుగనుంది.

## సవాల్ విసిరి చతికిలబడిన పాకిస్థాన్..

**తొలి విజయంతో చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్..!**



**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై తామెంత ప్రమాదకరమో బంగ్లాదేశ్ (ధీఅస్త్రశ్రీఃసవంప్త) జట్టు మరోసారి నిరూపించింది. తొలి టెస్టులో పాకిస్థాన్ బ్యాటర్లను వణకిస్తూ భారీ విజయాన్నందుకుంది. 'దమ్ముంటే మా ముందు దమ్ముంటే మా ముందు 70 ఓవర్లలో 260పైగా లక్ష్యాన్ని నిర్దేశించండి' అని సవాల్ విసిరిన సల్మాన్ అఘా తల పొగరను అణచివేస్తూ రెండు టెస్టుల సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది. మొదటి ఇన్నింగ్స్‌లో కాస్తో కూస్తో పోరాడిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కుప్పకూలింది. నహిద్ రానా (5-40) బంతితో చెలరేగిన వేళ బంగ్లా 104 పరుగుల తేడాతో గెలుపొందింది. తద్వారా స్వదేశంలో పాక్‌పై బంగ్లాదేశ్ మొదటి విజయంతో చరిత్ర సృష్టించింది.

ఢాకా టెస్టులో ఆతిథ్య బంగ్లాదేశ్ ధాటికి పాకిస్థాన్ నిలువలేకపోయింది. 268 పరుగుల స్వల్ప ఛేదనలో బ్యాటర్ల వైఫల్యంతో పాక్ కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో నహిద్ రానా(5-40) ఐదు వికెట్లతో బంగ్లాదేశ్ విజయంలో కీలకమయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో పట్టుదలగా ఆడిన పాక్ ఆటగాళ్లు ఏమోందో ఏమో రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం తేలిపోయారు.

టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన చోట అబ్దుల్లా ఫజల్(66) ఒక్కడే అర్ధ శతకంతో పోరాడాడు. కానీ, నహిద్ సంచలన స్పెల్‌తో పాక్ పతనాన్ని శాసించాడు. తొలి ఇన్నింగ్స్ శతకంతో.. రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీతో మెరిసిన బంగ్లా కెప్టెన్ శాంటో ' ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

**శాంటో సెంచరీ..**

తొలి ఇన్నింగ్స్‌లో పాక్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న నజ్ముల్ హుసేన్ శాంటో(103) సెంచరీతో కదం తొక్కాడు. సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం(71) మెరుపులతో బంగ్లాదేశ్ భారీ స్కోర్ దిశగా సాగింది. కానీ, మొహమ్మద్ అబ్బాస్(92-5) ఐదు వికెట్లు తీసి బంగ్లాను 413కే పరిమితం చేశాడు. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన పాక్ కూడా దీటుగానే బదులిచ్చింది.

ఓపెనర్ అజాన్ అవైస్(103), అబ్దుల్లా ఫజల్(87), సల్మాన్ అఘా(58), మహమ్మద్ రిజ్వాన్(59)లు అర్ధ శతకాతో రాణించినా.. మెహిదీ హసన్ మిరాజ్(5-102) ధాటికి 386కే ఆలౌటయ్యింది. రెండో ఇన్నింగ్స్‌లో శాంటో అర్ధ శతకంతో ఆదుకోగా బంగ్లా 9 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఇరుజట్ల మధ్య మే 16 నుంచి రెండో టెస్టు జరుగనుంది.

## కలల కప్ కోసం పకడ్బందీగా..

# ఆల్‌రౌండర్లతో సఫారీ స్క్వాడ్..!

**దక్షిణాఫ్రికా:** మహిళల టీ20 ప్రపంచకప్ సమీపిస్తుండడంతో దక్షిణాఫ్రికా బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. గత సీజన్‌లో రన్నరప్‌తోనే సరిపెట్టుకున్నా.. ఈసారి టైటిల్ లక్ష్యంగా మంగళవారం లారా వొల్వార్డ్ కెప్టెన్‌గా పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేసింది. పొట్టి ఫార్మాట్‌లో రాణిస్తున్న15 మందికి చోటు దక్కగా.. వీరిలో సీనియర్ పేసర్ షబ్నిం ఇస్మాయిల్ కూడా ఉంది. వరల్డ్‌కప్ కోసం వీడ్కోలు వెనక్కి తీసుకున్న ఆమె మెగా ఈవెంట్‌లో సఫారీ పేస్ దళాన్ని నడిపించనుంది.

అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీని పట్టేసేందుకు దక్షిణాఫ్రికా సిద్ధమవుతోంది. నిరుడు భారత గడ్డపై వన్డే ప్రపంచకప్‌లో అదిరే ఆటతో ఫైనల్ చేరినా.. అనూహ్యంగా తడబడిన సఫారీ సైన్యం.. ఈసారి టైటిల్ లక్ష్యంగా స్క్వాడ్‌ను ఎంపిక చేసింది. అనుభవజ్ఞురాలైన లారా వొల్వార్ట్ కెప్టెన్సీలో పొట్టి ప్రపంచకప్‌ను తన్నుకుపోవడానికి వస్తోంది. వన్డే ప్రపంచకప్ ఆడిన చాలామందికి పొట్టి కప్ ఆడబోతున్నారు. కానీ, గత సీజన్‌లో సఫారీ టీమ్ ఫైనల్ చేరడంలో కీలకమైన అనెకే బాష్ మాత్రం ఈ ఎడిషన్‌కు ఎంపికవ్వలేదు.

టాపార్డర్ బ్యాటర్లుగా తంజిమ్ బ్రిట్స్, డెర్క్‌సెన్, సునే లుస్ ఎంపికవ్వగా.. ఆల్‌రౌండర్లుగా మరినే కాప్, డీక్లెర్క్, చోలే ట్రయాన్‌లు చోటు సంపాదించారు. అండర్-19 కెప్టెన్ కైలా రెయ్‌న్కే తొలిసారి జాతీయ జట్టుకు ఆడనుండగా.. మూడేళ్ల క్రితం చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన షబ్నం ఇస్మాయిల్ యూటర్న్ తీసుకోవడంతో స్క్వాడ్‌లోకి వచ్చింది. ఇంగ్లండ్ వేదికగా జరిగే పొట్టి సంగ్రామంలో తను మరినే కాప్, డానే వాన్ నీకెర్క్, ఖాకతో కలిసి కొత్త బంతిని పంచుకోనుంది.



దక్షిణాఫ్రికా ప్రపంచకప్ స్క్వాడ్ : లారా వొల్వార్ట్(కెప్టెన్), తంజిమ్ బ్రిట్స్, నడినే డీక్లెర్క్, అనెరీ డెర్క్‌సెన్, సినాలో జఫ్తా(వికెట్ కీపర్), మరినే కాప్, సునే లుస్, కరాబో మెసో(వికెట్ కీపర్), నొనుకులులెకో మలబా, కైలా రెయ్‌నకే, తుమి సెఖునే, చొలే ట్రయాన్, డాన్ వాన్ నీకెర్క్, షబ్నిం ఇస్మాయిల్, అయబొంగ ఖాకా.

# విడాకుల జాబితాలో మరో నటి

## భర్తను అన్ ఫాలో చేసిన మౌనీరాయ్



**టాకీస్:** నటి మౌనీరాయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక వార్త కొన్ని రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది. భర్త సూరజ్ నంబియార్‌తో ఆమె విడిపోతున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలకు బలం చేకూర్చేలా ఇన్‌స్టాగ్రామ్‌లో వీరిద్దరూ ఒకరికొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీ రాయ్ తనకు సంబంధించిన విషయాలను పంచుకుంటూ టూర్స్ ఫొటోలను షేర్ చేస్తుంటారు. కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. అలాగే రూమర్స్‌ను ఇద్దరూ ఖండించకపోవడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. 2022 జనవరిలో తన ప్రియుడు సూరజ్ నంబియార్‌ను మౌనీరాయ్ గోవాలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. మౌనీరాయ్ 'విశ్వంభర'లో ఓ స్పెషల్ సాంగ్ చేసినట్లు సమాచారం. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. చిరంజీవి సూపర్ హిట్ సినిమా 'ఖైదీ'లోని రగులుతోంది మొగలిపొద.. పాట రీమేక్‌కు మౌనీరాయ్‌తో కలిసి చిరు మరోసారి మెస్మరైజ్ చేయనున్నట్లు తెలుస్తోంది.

## శ్రీనివాస మంగాపురం

# సెకండ్ సింగిల్ ప్రోమో




**టాకీస్:** మంగళవారం సినిమా హిట్ తరువాత అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తోన్న చిత్రాల్లో శ్రీనివాస మంగాపురం ఒకటి. ఘట్టమనేని వారసుడు జయకృష్ణ హీరోగా పరిచయమవుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పించడం మరింత బజ్ ని క్రియేట్ చేసింది. తాజాగా శ్రీనివాస మంగాపురం నుంచి సెకండ్ సింగిల్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. మంగా మంగా అంటూ సాగే ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టు కొంటుంది. తిరుపతిలో జరిగే ప్రేమకథగా శ్రీనివాస మంగాపురం తెరకెక్కుతోంది. కొత్తగా తిరుపతి కొచ్చిన కుర్రోళ్ళని బతకనివ్వరా..? అన్నదమ్ములు లేరా మీకు? అంటూ హీరో.. హీరోయిన్ అందాన్ని చూసి మైమరచిపోయి.. ఆమెపై ఉన్న ప్రేమ భావాలను తెలిపుతున్నట్లు లిరిక్స్ వింటుంటే అర్ధమవుతోంది.

# కమల్-రజనీ మూవీలో త్రిష



**టాకీస్:** తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.



# పెళ్లి తర్వాత మరింత అందంగా మెహ్రీన్..

## రాయల్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి

టాకీస్: టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మెహ్రీన్ పీర్జాదా ఇప్పుడు కొత్త జీవితాన్ని ఆస్వాదిస్తోంది. ఇటీవల అర్ష్ ఔలఖ్‌ను వివాహం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ, తాజాగా తన వివాహ వేడుక అనంతరం జరిగిన ప్రత్యేక వేడుకకు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకుంది. ఈ చిత్రాల్లో మెహ్రీన్ కనిపించిన తీరు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది. "నక్షత్రాల్లో రాసిన రాత్రి" అంటూ మెహ్రీన్ తన భర్త అర్ష్‌తో కలిసి దిగిన ఫోటోలను పంచుకుంది. ఈ ఫోటోల్లో ఆమె ధరించిన ప్రత్యేకమైన దుస్తులు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. షాంపేన్ రంగులో రూపొందించిన ప్రత్యేక లెహంగా, దానిపై చేసిన నాజూకైన చేతిపని ఎంబ్రాయిడరీ ఆమెకు మరింత రాయల్ లుక్‌ను తీసుకొచ్చాయి. ఈ ప్రత్యేక దుస్తులను ప్రముఖ పాకిస్థానీ డిజైనర్ రూపొందించినట్లు సమాచారం. లెహంగా పైభాగంలో జాకెట్ తరహాలో రూపొందించిన కేప్, దానికి సరిపోయే ఆభరణాలు మెహ్రీన్‌ను నిజంగానే ఓ యువరాణిలా చూపించాయి. ఆమె ధరించిన నగలు, మేకప్, హెయిర్ స్టైల్ అన్నీ కలిపి ఒక రాజసమైన పెళ్లి వేడుకను గుర్తు చేస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని అందమైన ప్రాంతాల్లో ఏప్రిల్ 26న వీరి వివాహం అత్యంత వైభవంగా జరిగినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు ఇప్పుడు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సినిమాల విషయానికి వస్తే, నాని హీరోగా నటించిన 'కృష్ణగాడి వీర ప్రేమ గాథ' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన మెహ్రీన్, చాలా తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. 'మహానుభావుడు', 'రాజా ది గ్రేట్', 'ఎఫ్ 2' వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా "హనీ ఈజ్ బెస్ట్" అనే డైలాగ్‌తో ఆమెకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఇప్పుడు పెళ్లి తర్వాత కూడా మెహ్రీన్ అదే అందం, హుందాతనంతో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆమె తాజా ఫోటోలను చూసిన అభిమానులు "చాలా అందంగా ఉన్నావు", "రియల్ ప్రిన్సెస్‌లా కనిపిస్తున్నావు" అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# ఎన్టీఆర్-నీల్ ప్రాజెక్ట్ మూవీ

## మే 19న అర్ధరాత్రి గ్లింప్స్ విడుదల



**టాకీస్:** జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఎన్టీఆర్-నీల్' ప్రాజెక్ట్ నుంచి అదిరిపోయే అప్డేట్ రాబోతోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా కెజిఎఫ్, 'సలార్' సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మాస్ యూనివర్స్‌ను సృష్టించిన ప్రశాంత్ నీల్, ఇప్పుడు తారక్‌ను ఎలా చూపించబోతున్నాడోననే ఆసక్తి అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను తారక్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో మే 20న అభిమానులకు భారీ ట్రీట్ ఖాయమని అందరూ భావించారు. అయితే ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, అభిమానుల ఉత్కంఠను మరింత పెంచేలా మేకర్స్ ఒక రోజు ముందుగానే గ్లింప్స్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అంటే మే 19 అర్ధరాత్రి 12 గంటలకే ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదల కానున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అర్ధరాత్రి నుంచే సోషల్ మీడియాలో తారక్ ఫ్యాన్స్ సంబరాలు మొదలయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన చిన్న చిన్న లీక్స్, సెట్స్ ఫోటోలు అభిమానుల్లో భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు ఫస్ట్ గ్లింప్స్‌తో ప్రశాంత్ నీల్ సృష్టించిన కొత్త ప్రపంచం ఎలా ఉ ండబోతుందో చూడాలని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు మే 18న రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' ట్రైలర్ విడుదల కానుండటంతో సోషల్ మీడియాలో ఇప్పటికే మెగా అభిమానుల హంగామా మొదలైంది. ఇక దానికి మరుసటి రోజే తారక్ గ్లింప్స్ రావడంతో మెగా-నందమూరి అభిమానుల మధ్య సోషల్ మీడియా వార్ పీక్స్‌కు చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తారక్ నుంచి వస్తున్న ఈ భారీ సోలో ప్రాజెక్ట్ కావడంతో ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక మే 19 అర్ధరాత్రి విడుదలయ్యే గ్లింప్స్‌లో తారక్ లుక్, క్యారెక్టర్, సినిమా బ్యాక్‌డ్రాప్‌పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.

# వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త

## రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ



**టాకీస్:** మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషి కం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకు న్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టు కోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటి వరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుము డి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నా యని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సా ధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed published and own by him Dr. kongarapu Ganapathi, Phone number: 9494451230, D.No 1/164 Balanki street, paalakonda-532440.
Officeaddress D-NO: 8-33-13, Near Kalabarathi opp com office, pithapuram colony, Maddilapalem visakhapatnam-530003. RNI:APTEL 2013/54721.
Editor in Chief: Danuri Srinivas - 9441500341